
మీ-సేవ కేంద్రాలు మంజూరు

కులకచర్ల, జూన్ 27: కులకచర్ల మండల మహిళా సమాఖ్యకు మూడు మీ-సేవ కేంద్రాలను ప్రభుత్వం మంజూరు చేసిందని ఏపీయం శోభ పేర్కొన్నారు. బండవెల్కిచర్ల, ముజాహిద్‌పూర్, సాల్విడ్ గ్రామాలకు మీ-సేవ కేంద్రాలు మంజూరయ్యాయని తెలిపారు. గ్రామ మహిళ సమాఖ్య నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. సమాఖ్య ఆధ్వర్యంలో మీ సేవ కేంద్రాలు కొనసాగుతాయని, త్వరలోనే వాటిని ప్రారంభిస్తామని తెలిపారు.



ప్రభుత్వం ఇంకా వానాకాలం పంటరుణాల ప్రణాళికను ఖరారు చేయలేదు. దీంతో రైతులకు క్రాప్‌లోన్లు అందడం లేదు. ప్రభుత్వం ఇచ్చే రైతుభరోసా కూడా రాక పెట్టుబడి ఖర్చులు లేక సాగుకు అన్నదాతలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రతీ సీజన్ ఆరంభంలో లీడ్ బ్యాంకర్లతో జిల్లాల వారీగా కలెక్టర్ల అధ్యక్షతన సమావేశాలు నిర్వహించి రుణ ప్రణాళిక ఖరారు చేస్తారు. కానీ ఈ సీజన్‌లో ఇంత వరకు అటువంటి చర్యలేవీ తీసుకోలేదు. దీంతో కొత్తగా రుణాలు అందలేదు. పాత లోన్ల రెన్యూవళ్లపై సైతంస్పష్టత రాలేదు. రుణాలిచ్చేందుకు బ్యాంకర్లు ముందుకు రావడం లేదు. దీంతో రైతులు ఎక్కువ శాతం వడ్డీకి ప్రైవేట్ రుణాలు తీసుకొని సాగు పనులకు ఉపక్రమిస్తున్నారు.

- అటకెక్కిన రుణ ప్రణాళిక
- వానాకాలం సీజన్ ప్రారంభం
- 'రైతుభరోసా'పై రాని స్పష్టత
- సాగుకు అప్పులు చేస్తున్న రైతులు
- విత్తనాలు, ఎరువులు కొనుగోళ్లు, ఇతర ఖర్చులకు పాట్లు

సీజన్ ఆరంభంలోనే కష్టాలు

వానాకాలం సీజన్ ప్రారంభమై ఇరవై ఐదు రోజులు గడిచింది. ఏటా నిర్వహించే రైతు చైతన్య సదస్సులు కూడా ఈ సారి నిర్వహించడం లేదు. సదస్సుల్లో పంట రుణాల గురించి వివరిస్తారు. ఈ సారి ఆ కార్యక్రమాలేవీ చేపట్టలేదు. విత్తనాలు, ఎరువుల పంపిణీ, సాగు అవగాహనపై మాత్రం సమావేశాలు నిర్వహించి చేతులు దులుపుకున్నారు. పంటరుణాలపై ఇప్పటి వరకు ప్రణాళికలేవీ చేయలేదని అధికారులే స్పష్టంగా చెబుతున్నారు. సీజన్ వచ్చినా క్రాప్‌లోన్ల గురించి అతీగతీ లేక రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం పంట రుణాల అవశ్యకత చాలా ఉంది. తమకు పంట రుణాలపై ఆదేశాలు రాలేదని బ్యాకర్లు చెబుతున్నారు. కొత్తగా రుణాలిచ్చే పరిస్థితి సైతం లేదని వారంటున్నారు. దీంతో రైతులు ఎక్కువ మిత్తికి ప్రైవేట్ రుణాలపై ఆధారపడాల్సి వస్తోంది.

సాగు మొదలు..
సాయం కరువు!

పరిగి, జూన్ 27 : వానాకాలం సాగు సీజన్ ప్రారంభమైంది. మృగశిర కార్తె వచ్చి పోయింది. అక్కడక్కడ చిన్నపాటి వర్షాలు కురిశాయి. మరింత వానలు కురిస్తే రైతులంతా విత్తనాలు వేస్తారు. ఇప్పటికే వారు దుక్కుల దున్నుకం, ఇతర సాగుపనుల్లో బిజీగా ఉన్నారు. అయితే వానాకాలం పెట్టుబడి లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం ఒకేసారి రూ.2లక్షల వరకు రైతుల పంటరుణాలు మాఫీ చేస్తామనడం వారికి సంతోషకరమే అయినా ఇప్పటికిప్పుడు మాఫీ అయ్యేలా కన్పించడం లేదు. మరి అదును దాటితే పంటలు వేయలేరు. వేద్దామంటే విత్తనాలు, ఎరువులు, కూలీలు, దున్నుకానికి పెట్టుబడికి డబ్బు కావాలి. యాసంగిలో బోర్ల కింద సాగుచేసుకున్న రైతులకు పంట అమ్మిగా ఎంతో కొంత డబ్బు సమకూరినా మెట్ట పంటలు వేసే రైతులకు ప్రతీ వానాకాలం ఆరంభంలో పెట్టుబడి ఖర్చులకు ఇబ్బందులు తప్పడం లేదు. పంటను బట్టి ఎకరానికి హీనపక్షం 15వేల నుంచి 20వేల వరకు పెట్టుబడి అవుతుంది. ప్రభుత్వం అమలు చేస్తున్న రైతుభరోసా(గతంలో రైతుబంధు) ఇంకా రైతుల ఖాతాల్లో జమకాలేదు. ఈ పథకం కింద ప్రభుత్వం ఎకరానికి ఐదు వేల చొప్పున ప్రతీ రైతుకు ఎన్ని ఎకరాల భూమి ఉంటే అన్ని ఎకరాలకు ఇచ్చేది.

జిల్లాలో పంటల సాగు ఇలా..

జిల్లాలో వివిధ రకాల పంటలు మొత్తం 5,97,830 ఎకరాల్లో సాగు చేస్తారని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేశారు. గతేడాది సాగు చేసిన పత్తి, కంది, మొక్కజొన్న పంటల విస్తీర్ణం కంటే ఈ సారి మరింత ఎక్కువ సాగయ్యే అవకాశం ఉంది. గత వానాకాలంలో పత్తి 2,50,099 ఎకరాల్లో వేశారు. ఈ సారి 2,63,500 ఎకరాల్లో సాగయ్యే అవకాశం ఉంది. కంది 1,04,448 ఎకరాల్లో వేయగా ఈ సారి 1.50,000 ఎకరాల్లో వేసే ఆస్కారం ఉంది. గతంలో మొక్కజొన్న 38,082 ఎకరాల్లో సాగు చేయగా, ఈ సారి 50,450 ఎకరాలకు పెరిగే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. వరి గతేడాది 1,33,992 ఎకరాల్లో సాగు చేయగా, ఈ సారి 1,10,000 ఎకరాల్లో సాగు చేసే అవకాశం ఉంది. జొన్న ఈ సారి 2,504 ఎకరాల్లో సాగయ్యే అవకాశం ఉంది. మినుములు 5వేల ఎకరాల్లో, పెసర 13,500ఎకరాల్లో సాగు కావచ్చని భావిస్తున్నారు. ఈ అంచనాలన్నీ వర్షాలు బాగా కురిసి వాతావరణం అనుకూలిస్తేనే నెరవేరే ఆస్కారం ఉంది. ఇప్పటి వరకు జిల్లాలో పది శాతం విత్తనాలైనా విత్తలేదు.

పంట రుణాల ఊసేది?

ఇప్పుడు కొత్తగా పెంచి రూ.7,500 చొప్పున ఇస్తారా? లేక పాత మొత్తమే ఇస్తారా అనేది తేలాల్సి ఉంది. గతంలో ప్రతీ జూన్ మధ్యలో నుంచి నెలాఖరుకల్లా పెట్టుబడి సాయం అందేది. కొత్త ప్రభుత్వం రైతుభరోసా ఎప్పుడు ఇస్తుందో ఇంకా స్పష్టత రావాల్సి ఉంది. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కిసాన్ సమ్మాన్ పథకం కింద నాలుగు నెలలకోసారి రెండు వేల చొప్పున రైతుల ఖాతాల్లో వేస్తున్నా అది ఏ మూలకూ సరిపోవడం లేదు. ఇదిలా ఉంటే బ్యాంకుల ద్వారా ఇచ్చే పంట రుణాల ఊసే లేకుండా పోయింది. పెట్టుబడికి రైతులు ప్రైవేట్ అప్పులపైనే ఆధారపడాల్సి వస్తోంది. ఏటా వానాకాలం, యాసంగి సీజన్ల మొదట్లో లీడ్ బ్యాంకుల అధికారులతో ప్రభుత్వం రుణ ప్రణాళికపై చర్చించి ఆ మేరకు జిల్లాల్లో ఎంత మేర రుణాలివ్వాలి, ఇప్పటికే రుణం తీసుకున్న రైతులెంత మంది, పాత రుణాలను రెన్యూవల్ చేసుకున్న వారెందురు.. కొత్తగా రుణం కోసం ఎంత మందికి అవకాశం ఉంది.. అనే అంశాలపై చర్చించి ఆ మేరకు రుణ ప్రణాళిక సిద్ధం చేసేవారు. కానీ ఈ సారి ఇంకా అలాంటి ప్రణాళికలేవీ చేయలేదు. ప్రభుత్వ సాయం కూడా అందలేదు. రుణ ప్రణాళిక ఖరారు కాక బ్యాంకులు రుణాల పంపిణీ మొదలుపెట్టలేదు. రైతు రుణాలకు బ్యాంకులు ముందుకు రావడం లేదు. ఒక అంచనా ప్రకారం ఇప్పటి వరకు రైతులు సరాసరి ఎకరానికి రూ.30వేలకుపైగానే రుణం పొందారు. వీరంతా ఎస్బీఐ, డీజీబీ, యూనియన్ బ్యాంకు, డీసీసీబీల ద్వారా రూ.1,800కోట్ల వరకు పంట రుణాలు పొందినట్లు తెలుస్తోంది. రుణమాఫీ, రైతుబంధు వంటి స్కీంలతో పంటరుణాల రికవరీలు నిలిచిపోయాయి. రాష్ట్ర ప్రభుత్వం పెట్టుబడిసాయం ఇచ్చేందుకు ఆలస్యం అవుతున్న నేపథ్యంలో బ్యాంకుల ద్వారా పంటరుణాలు ఇస్తే సాగు చేసుకోవచ్చని రైతులు భావిస్తున్నారు. రైతుభరోసాతో సంబంధం లేకుండా పాత వారికి అదనంగా, అలాగే కొత్తగా తీసుకునే వారికి రుణాలిచ్చేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

రుణాలు ఇవ్వకపోతే ఎట్లా?



వానాకాలం సీజన్ వచ్చింది. ప్రభుత్వం రైతుభరోసా ఇవ్వడం లేదు. గతంలో జూన్‌లో వేసేవారు. ఈ ప్రభుత్వం ఎప్పుడేస్తుందో తెలియడం లేదు. రుణాలు గురించి బ్యాంకులో అడిగితే ఆ సంగతి మాకు తెలియదంటున్నారు. యాసంగిలో అందరూ పంటలు వేయరు. నీటి వసతి లేని వారు ఏడాదికోసారే వర్షాధార పంటలు వేస్తారు. అలాంటి వారికి పెట్టుబడి భారంగా మారుతుంది. ప్రభుత్వం వెంటనే రైతుభరోసా, పంటరుణాలు ఇప్పించేందుకు చర్యలు తీసుకోవాలి

-జబ్బార్, రైతు, సుల్తాన్‌పూర్, పరిగి మండలం

వానాకాలం పంటలకు సన్నద్ధమవుతున్నాం



రైతుభరోసా అందేందుకు ఇంకా సమయం పట్టేట్టుంది. ఎకరానికి ఇప్పటి దాకా ఇస్తున్న రూ.5వేలను పెంచి ఏడున్నర వేలు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయియింది. అయితే నిధులు ఎప్పుడు విడుదల చేస్తారనేది స్పష్టత రాలేదు. వచ్చే నెలలో సాయం అందే అవకాశం ఉంది. పంటరుణాలకు సంబంధించి మాకు ఎలాంటి ఆదేశాలూ రాలేదు. రుణాలకు సంబంధించి బ్యాంకర్లు, లీడ్ బ్యాంకువాళ్లే లక్ష్యాలను నిర్దేశిస్తారు. ఇప్పటి వరకైతే రుణ ప్రణాళికేమీ ఖరారు చేయలేదు.

- గోపాల్, జిల్లా వ్యవసాయాధికారి



వికారాబాద్‌లో కురుస్తున్న వర్షం

మోస్తరు వాన

వికారాబాద్/ధారూరు/ఘట్‌కేసర్/బషీరాబాద్, జూన్ 27: వికారాబాద్ జిల్లాలో గురువారం పలు చోట్ల మోస్తరు వాన కురిసింది. వికారాబాద్ పట్టణంలో చిరుజల్లులు కురియగా, ధారూరులో మాత్రం మోస్తరు వాన కురిసింది. దీంతో రోడ్లు చిత్తడిగా మారాయి. అయితే భారీ వర్షం కురవాలని రైతులు వేడుకుంటున్నారు. విత్తనాలు విత్తి ఆకాశం వైపు చూస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో వర్షాల కోసం కప్పకావడి, వరదపాశం, తదితర పూజలు చేస్తున్నారు. 20 రోజులుగా వర్షాలు కురవకపోవటంతో రైతన్నలు ఆందోన చెందుతున్నారు. వానలు లేక విత్తిన పత్తి, కంది, విత్తనాలు సక్రమంగా మొలకెత్త లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మేడల్ జిల్లా ఘట్‌కేసర్‌లో మోస్తరు వర్షం కురిసింది. వరినార్లు పోసుకొని భారీ వర్షాల కోసం ఎదురుచూస్తున్న రైతులకు నిరాశే మిగులుతున్నది. బషీరాబాద్ మండలంలోని పలు గ్రామాల్లో మోస్తరు వర్షం కురిసింది. మెట్ట పంటకు ఈ వర్షంతో కొంత జీవం పోసినట్లైందని రైతులు ఆనందం వ్యక్తం చేశారు.

వర్షం కురవాలని....

పెద్దేముల్: వర్షాలు కురవాలని పెద్దేముల్ మండలం ఆత్కూర్ గ్రామంలో మహిళలు గురువారం కప్పకావడి నిర్వహించారు. రోకలికి కప్పను వేలాడదీసి, వేపకొమ్మలు కట్టి వర్షాలు కురవాలని ఇంటింటికి తిరిగారు. స్థానికులు కప్పపై నీళ్లు పోసి వానలు కురవాలని మొక్కుకున్నారు. అనంతరం ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు.



ఆత్కూర్‌లో కప్పకావడితో ఇంటింటికి తిరుగుతున్న మహిళలు

ఎర్రమట్టి అక్రమ తవ్వకాలపై విచారణ



ఎర్రమట్టి తవ్వకాలను పరిశీలిస్తున్న తహసీల్దార్ తారాసింగ్

తాండూరు రూరల్, జూన్ 27: తాండూరు మండలం రాంపూర్ గ్రామ శివారులోని సర్వే నంబర్ 9లో అనుమతులు లేకుండా ఎర్రమట్టి తవ్వకాలపై రెవెన్యూ అధికారులు స్పందించారు. గురువారం తాండూరు తహసీల్దార్ తారాసింగ్ , ఆర్ఐ బాలరాజ్‌తో కలిసి ఎర్రమట్టి తవ్వకాలను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఎలాంటి అనుమతులు లేకుండానే తవ్వకాలు జరిపినట్లు తహసీల్దార్ తారాసింగ్ తెలిపారు. రైతు ఎన్ని క్యూబిక్ మీటర్ల మేర ఎర్రమట్టి తవ్వకాలు చేపట్టారు. ప్రభుత్వ అనుమతులు లేకుండానే తవ్వకాలు జరుపడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సమగ్ర నివేదిక తయారు చేసి ఉన్నతాధికారులకు అందజేయనున్నట్లు తెలిపారు. ఇదిలా ఉండగా మైన్స్ అధికారులు మాత్రం అంతా పెద్దఎత్తున ఎర్రమట్టి తవ్వకాలు చేపట్టినా పరిశీలించకపోవడం గమనార్హం.

ఆహ్లాదకరమైన వాతావరణంలో విద్యనందించాలి

- కలెక్టర్ ప్రతీక్ జైన్

వికారాబాద్, జూన్ 27 : ఆహ్లాదకరమైన వాతావరణంలో పిల్లలకు విద్యాబోధన చేయాలని కలెక్టర్ ప్రతీక్‌జైన్ అన్నారు. గురువారం వికారాబాద్ పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల శివారెడ్డిపేట , యూపీఎస్ ఉర్దూ మీడియం, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఎన్నెపల్లి, అంగన్‌వాడి కేంద్రం-1 , జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ. పరిసరాలు బాగుండి, సరైన విద్యాబోధనా ఉంటేనే పిల్లలు బాగా చదువుకోగలుగుతారన్నారు. అంగవాడి, ప్రాథమిక స్థాయి నుంచే పిల్లలకు ఇంగ్లీష్‌లో రాయడం, చదవడం నేర్పించాలన్నారు. అంగన్‌వాడి కేంద్రంలో పిల్లలతో ఇంగ్లీష్ పోయమ్స్ ఏబీసీడీలు చదివించారు. పిల్లలకు నోట్ బుక్స్, పెన్నులు అందజేశారు. అమ్మ ఆదర్శ పాఠశాల కింద చేపట్టిన పనులను పరిశీలించారు. ఇంకా చేయాల్సిన పనుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ క్లాసు రూమ్స్, టాయిలెట్స్, రన్నింగ్ వాటర్, కిచెన్‌షెడ్, తాగు నీరు, విద్యుత్ సరఫరా తదితర వాటిని పరిశీలించారు. ప్రతి స్కూల్ బిల్డింగ్ పైభాగంలో నీరు నిలువకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. మున్సిపల్ కమిషనర్ జాకీర్‌అహ్మద్ , విద్యాధికారి బాబుసింగ్, ప్రధానోపాధ్యాయుడు అనంత రెడ్డి, యునూష్ , శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.



ఎన్నెపల్లి అంగన్‌వాడీలో విద్యార్థులకు బుక్కులు, పెన్సిల్ అందజేస్తున్న కలెక్టర్ ప్రతీక్ జైన్

ఆగస్టు 15లోపు రుణమాఫీ చేస్తాం

- స్పీకర్ ప్రసాద్‌కుమార్

మోమిన్‌పేట్, జూన్ 27: ఆగస్టు 15లోపు రైతులకు రెండు లక్షల రైతు రుణమాఫీ చేయడం జరుగుతుందని స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. గురువారం మోమిన్‌పేట్ రైతు వేదికలో కల్యాణ లక్ష్మీ, షాదీముబారక్ చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్‌రెడ్డి బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని తెలిపారు. అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోపే ఆరు గ్యారంటీలను అమలు చేసి ప్రజలకు చేరవయ్యామన్నారు. త్వరలోనే పేదింటి ఆడబిడ్డల పెళ్లిళ్ల కోసం ఇచ్చిన హామీ మేరకు రూ.లక్షతో పాటు తులం బంగారం ఇవ్వనున్నట్లు తెలిపారు. వికారాబాద్ జిల్లాను అన్నీ విధాలుగా అభివృద్ధి చేస్తామని తెలిపారు. వికారాబాద్ జిల్లాలో ఇరిగేషన్ కోసం రూ.250 కోట్లు, రూ.240 కోట్లతో పంచాయతీల్లో రోడ్లు, మురుగు కాల్వలు, రూ.220 కోట్లతో వికారాబాద్ నియోజకవర్గంలోని మండలాల నుంచి జిల్లా కేంద్రాలకు రోడ్డు సౌకర్యం, శ్రీ అనంతగిరి పద్మనాభ స్వామి దేవాలయాన్ని రూ.500 కోట్లతో పర్యాటక కేంద్రంగా ఏర్పాటు చేసి ఉద్యోగ కల్పనకు కృషి చేస్తామని తెలిపారు. ఎన్కతల గ్రామంలో గల మొబిలిటి వ్యాలీతో పరిశ్రమల ఏర్పాటుతో ఉద్యోగాల కల్పనకు కృషి చేస్తామన్నారు. రైతులకు పంట పెట్టుబడి సహాయంగా సంవత్సరానికి రూ.15వేలు, 18 సంవత్సరాలు నిండిన మహిళలకు రూ.2500, కౌలు రైతులకు రూ.15వేలు, ఆటో డ్రైవర్‌లకు సంవత్సరానికి రూ.12వేలు ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ మనోహరచక్రవర్తి, ఎంపీడీవో యాదగిరి, ఆర్ఐ రాజు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మన్నె శంకర్ యాదవ్, మండల వర్కింగ్ ప్రసిడెంట్ సిరాజుద్దీన్, కాంగ్రెస్ నాయకులు సుభాష్‌గౌడ్, మహేందర్‌రెడ్డి, సురేందర్, ఏరాజ్‌పాష, శ్రీనివాస్‌రెడ్డి, మానెయ్య, చంద్రయ్య, సోమారపు రవి, రామకృష్ణారెడ్డి, మాజీ సర్పంచ్ సురేశ్, చంద్రయ్య పాల్గొన్నారు



చెక్కులను పంపిణీ చేస్తున్న స్పీకర్ ప్రసాద్‌కుమార్

- డెయిరీ నుంచి వెలువడుతున్న రసాయనాలు
- పంట పొలాలు, చెరుల్లోకి పారుతున్న వైనం
- జీవాలు, చేపలు మృత్యువాత.. బీడుగా మారుతున్న భూములు
- పట్టించుకోని కాలుష్య నియంత్రణ అధికారులు

కాలుష్యకోరల్లో పంటపొలాలు

మూడుచింతలపల్లి, జూన్ 27 : పరిశ్రమలు వస్తే యువతకు, స్థానికులకు ఉపాధి లభిస్తుందని ఆశలతో ఒకప్పుడు ఎదురుచూసేవారు. ఇప్పుడు గ్రామాల్లో పరిశ్రమల ఏర్పాటుతో రైతులు, ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. కంపెనీల నుంచి వెలువడే కాలుష్యంతో ఇబ్బందులు పడుతున్నారు. పరిశ్రమల యాజమాన్యాలు నిబంధనలను తుంగలో తొక్కి ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నాయి. అభయ డెయిరీ పరిశ్రమ నుంచి వెలువడుతున్న ప్రమాదకరమైన రసాయనాలను ట్యాంకర్ల ద్వారా బయటకు పంపించాలి కానీ, ఇక్కడ అందుకు భిన్నంగా పంటలు పండే పొలాల్లోకి, చెరువుల్లోకి వదిలేస్తున్నారు. దీంతో భూసారం దెబ్బతి ఆ భూములు ఎందుకూ పనికి రాకుండా పోతున్నాయి. దీంతో వ్యవసాయ రంగం దెబ్బతింటోంది. అంతేకాకుండా పరిశ్రమ నుంచి వెలువడే రసాయనాలను చెరువులో వదిలిపెట్టడంతో చేపలు, పశువులు మృత్యువాత పడుతున్నాయి చెరువులో చేపలను పట్టుకొని విక్రయించి జీవనం సాగిస్తున్న మత్సకారులకు తీవ్ర నష్టం కలుగుతోంది. ఇంత జరుగుతున్నాకాలుష్య నియంత్రణ అధికారులు అటువైపు కన్నెత్తి చూడడం లేదు. మూడుచింతలపల్లి మండలం అంటేనే పచ్చని పొలాలతో పచ్చల హారంలా వెల్లు విరిసేది. మండల పరిధిలోని కొల్తూర్ గ్రామంలోని అభయ డెయిరీ ఏర్పాటుతో స్థానికులకు, యువతకు ఉపాధి దొరుకుతుందని భావించారు గ్రామస్తులు. కానీ ఆ పరిశ్రమ ఏర్పాటు తర్వాత గ్రామంలోని భూములు ఎందుకు పనికిరాకుండా పోతాయని ఊహించలేదు. ఉపాధికి బాటలు వేయాల్సిన పరిశ్రమ యాజమాన్యం నిబంధనలను ఉల్లంఘిస్తూ పరిశ్రమ నుంచి వెలువడే ప్రమాదకర రసాయన వ్యర్థాలను వ్యవసాయ భూముల్లోకి వదిలిపెడుతోంది.. దీంతో భూగర్భ జలాలు కాలకూట విషంలా మారిపోతున్నాయి. పంటపొలాలు సైతం బీడుగా మారుతున్నాయని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రైతన్నల నడ్డివిరుస్తున్న డెయిరీ పరిశ్రమ యాజమాన్యంపై అధికారులు చర్యలు తీసుకోకపోవడం శోచనీయమని పలువురు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



పొలంలోకి వదిలిన డెయిరీ రసాయన వ్యర్థాలు



అభయ డెయిరీ

ఫిర్యాదు చేసినా కన్నెత్తి చూడని అధికారులు

డెయిరీ నుంచి వెలువడుతున్న ప్రమాదకర రసాయనాలతో ఇబ్బందులు తలెత్తుతున్నాయని కాలుష్య నియంత్రణ మండలి అధికారులకు స్థానికులు, రైతులు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఫిర్యాదు చేసినప్పుడు మాత్రమే వచ్చామా, పోయామా తప్పా, పరిశ్రమ యాజమాన్యంపై చర్యలు తీసుకున్న పాపాన పోలేదు. ప్రజలపై విషం చిమ్ముతున్న పరిశ్రమ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాల్సిన అధికారులు అమ్యామ్యాలకు అలవాటుపడి చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా మూడుచింతలపల్లి మండలంలో అధికారులు పర్యటించి పరిశ్రమల నుంచి వెలువడుతున్న కాలుష్యాన్ని పరిశీలించి కఠినమైన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు రైతులు కోరుతున్నారు. దీనిపై కాలుష్య నియంత్రణ అధికారి రాజేందర్ వివరణకు ఫోన్‌లో సంప్రదించగా అందుబాటులోకి రాలేదు.

రసాయణ నీటిని భూముల్లోకి వదులుతున్నారు



కొల్తూర్ గ్రామ పరిధిలోని అభయ డెయిరీ నుంచి వెలువడుతున్న రసాయనాలను పంటపొలాల్లోకి వదులుతున్నారు. దీంతో భూసారం కోల్పోయి పంటలు పండడం లేదు. దిగుబడి తగ్గుతోంది. కొందరు సాగు చేయడమే మానేశారు. డెయిరీ యాజమాన్యంపై అధికారులు చర్యలు తీసుకోవాలి.

- మంద రామకృష్ణారెడ్డి, కొల్తూర్ గ్రామస్తుడు

అధికారులు పట్టించుకోవడం లేదు



అభయ డెయిరీ నుంచి వెలువడే రసాయనాలు భూముల్లోకి, చెరువులోకి వదిలిపెడుతున్నారు. భూగర్భజలాలు కలుషితం అవుతున్నాయి. పశువులు, జీవాలు, ఆ నీటిని తాగడంతో చనిపోతున్నాయి. చెరువులో చేపలు మృత్యువాత పడుతున్నాయని పలు సార్లు అధికారులకు మొరపెట్టుకున్నా పట్టించుకోవడం లేదు.

- శ్రీనివాస్‌రెడ్డి, వైస్ ఎంపీపీ మూడుచింతలపల్లి మండలం

బెంచీలపై కూర్చోవాలంటే మోసుకొచ్చుకోండి

- ప్రిన్సిపాల్ ఆదేశంతో బరువైన బెంచీలు మోసిన కళాశాల విద్యార్థినులు
- నిధులు, అటెండర్ లేడంటూ సాకు
- తాండూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఘటన


బెంచీలు మోస్తున్న తాండూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థినులు

తాండూరు, జూన్ 27: ప్రభుత్వ కళాశాలలో చదివే విద్యార్థినులకు అడుగడుగునా ఇబ్బందులు ఎదురవుతున్నాయి. తాండూరు ప్రభుత్వం జూనియర్ కళాశాలలో జరిగిన సంఘటనే ఇందుకు నిదర్శనం. మొన్న కళాశాల నూతన భవనానికి నిధులు రాలేదని కాంట్రాక్టర్ తాళం వేసుకుని వెళ్లాడు. ఎట్టకేలకు గదులు తెరిచినా ఆ గదుల్లో విద్యార్థులు కూర్చునేందుకు బెంచీలు లేవు. బెంచీలపై కూర్చోవాలంటే బెంచీలు మోసుకొచ్చుకోండి అంటూ ప్రిన్సిపాల్ చెప్పిన మాటలను విద్యార్థినులు పాటించకతప్పలేదు. దీంతో విద్యార్థినులు చేసేది లేక తాండూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం విద్యార్థినులు బెంచీలు మోశారు. దాదాపు 200మీటర్ల దూరం మొదటి అంతస్థులోకి ఆయాసపడుతూ బెంచీలు మోశారు. అధ్యాపకులు, ప్రిన్సిపాల్ కూడా లేబర్ పెడదామంటే నిధులు లేవని, అటెండర్‌ను కూడా ప్రభుత్వం నియమించకపోవడంతో ఈ పరిస్థితి ఏర్పడిందని సాకుగా చెబుతున్నారు. తాండూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రెండు రోజుల కిందట రూ.2కోట్ల వ్యయంతో నిర్మించిన కొత్త భవనాన్ని ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి చేతులమీదుగా ప్రారంభించి గదులను అందుబాటులోకి తెచ్చారు. ప్రారంభమైన రెండవ రోజే కాంట్రాక్టర్ డబ్బులు రాలేవంటూ తాళం వేసుకున్నారు. ఎట్టకేలకు గదులు తెరిచారు. గురువారం పాఠశాలకు వచ్చిన విద్యార్థినులు బెంచీలు లేవని ప్రిన్సిపాల్‌ను కోరగా పాత భవనంలో ఉన్నాయి. తెచ్చుకొని వేసుకొండి అంటూ సమాధానం ఇవ్వడంతో విద్యార్థినులు చేసేదిలేక పాత భవనంలో ఉన్న కుర్చీలను కొత్త భవనంలోకి మోసుకెళ్లారు. బరువైన బెంచీలను మోసుకుంటూ వెళ్లి ఎవరి తరగతిలో వాళ్లు బెంచీలను తీసుకెళ్లారు. నిబంధనలకు విరుద్ధంగా కాలేజీ అమ్మాయిలతో బెంచీలు మోయించడం, ప్రిన్సిపాల్, అధ్యాపకులు బాధ్యతలను విస్మరించడంపై చర్చనీయాంశమైంది. ఈ విషయమై కళాశాల ప్రిన్సిపాల్‌ను వివరణ కోరగా విద్యార్థినులు తామే బెంచీలు వేసుకుంటామని చెప్పారని చెప్పడం గమనార్హం.

కులకచర్లలో జోరుగా ఇసుక దందా


కుసుమ సముద్రం దగ్గర ఇసుక డంపు

కులకచర్ల, జూన్ 27:మండలంలో ఇసుక దందా జోరుగా సాగుతోంది. సంబంధిత అధికారులు ఏ చర్యలు తీసుకోకపోవడంతో కొందరికి ఈ దందా మూడు పువ్వులు ఆరు కాయలుగా మారింది. వర్షాలు లేకపోవడంతో వాగుల్లో ఉన్న ఇసుకను తీసుకొచ్చి డంపింగ్ చేసి విక్రయిస్తున్నారు. మరికొందరు కృత్రిమంగా ఫిల్టర్ ఇసుకను తయారు చేసి విక్రయిస్తున్నా అధికారులు ఏచర్యలు తీసుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మండలంలోని కుసుమ సముద్రం గ్రామవాగులో గ్రామానికి చెందిన కొందరు 30ట్రాక్టర్ల ఇసుక తీసి విక్రయించేందుకు డంపింగ్ చేశారు. గటన్నపల్లి తండా మిషన్ భగీరథ ట్యాంకు దగ్గర ఫిల్టర్ ఇసుక తయారు చేస్తున్నారు. రాంపూర్ గ్రామ పరిధిలో కొందరు తమ బోరు బావుల దగ్గర ఫిల్టర్ ఇసుకను తయారు చేసేందుకు మట్టిని తెచ్చి సిద్ధంగాఉంచారు. డంపులు చేసిన ఇసుకను రాత్రి సమయంలో గుట్టు చప్పుడు కాకుండా ఇతర ప్రాంతాలకు ట్రాక్టర్ల ద్వారా తరలించి విక్రయిస్తున్నారు. కొందరు ఇసుక విక్రయాన్ని దందాగా మార్చుకొని లక్షలాది రూపాయలు సంపాదిస్తున్నారు. నిల్వ ఉన్న ఇసుక డంపులపై తహసీల్దార్ మురళీధర్‌ను వివరణ కోరగా కుసుమ సముద్రం గ్రామ పరిధిలో గటన్నపల్లి తండా దగ్గర ఇసుక డంపులు ఉన్నట్లు తమ దృష్టికి వచ్చిందని వాటిని సీజ్ చేస్తామని తెలిపారు.


గటన్నపల్లి తండాలో నిల్వ ఉన్న ఇసుక డంపు

మున్సిపాలిటీలో మారని ఎంపీ పేరు

● ఇంకా రంజిత్‌రెడ్డి పేరు దర్శనం

వికారాబాద్, జూన్ 27: చేవెళ్ల ఎంపీగా విశ్వేశ్వర్ రెడ్డి గెలిచి 20రోజులు పూర్తవుతున్న మున్సిపాలిటీలో ఆయన పేరు మాత్రం మారడంలేదు. ఇంకా చేవెళ్ల ఎంపీగా రంజిత్‌రెడ్డి పేరునే కొనసాగిస్తున్నారు. మున్సిపల్ కార్యాలయంలోకి వెళ్లే ముందు ఏర్పాటు చేసిన ప్రజాప్రతినిధుల పేర్ల బోర్డులో విశ్వేశ్వర్‌రెడ్డి పేరు మార్చాల్సి ఉన్నా అధికారులు మాత్రం ఇంకా పాత పేరును కొనసాగిస్తున్నారు.


మున్సిపాలిటీలో మారని ఎంపీ పేరు

మా సారు మాకే ఉండాలి


ఎంఈవోకు వినతిపత్రం అందజేస్తున్న ముజాహిద్‌పూర్ గ్రామస్థులు

కులకచర్ల, జూన్ 27: ముజాహిద్‌పూర్ గ్రామ సందని గడ్డ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం సంతోష్‌కుమార్ బదిలీ నిలిపివేయాలని గ్రామస్థులు గురువారం ఎంఈవో హబీబ్ అహ్మద్‌కు వినతి పత్రం అందజేశారు. ఆయన పిల్లలకు చక్కగా బోధించారని, మాసారు మాకే ఉండాలంటూ కలెక్టర్‌కు, డీఈవోకు వినతి పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు శ్రీనివాస్, అంజి, పులింగ చిన్న వెంకటేశ్, దప్పు రత్నం, పులింగ అంజి, కిన్నెర శ్రీనివాస్, రెడ్డిపల్లి శ్రీనివాస్, తానం రవి, చెరువుల భీమయ్య, మేకల అంజి, దండు మహేశ్, తాన మల్లేశ్ పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ భర్తపై దాడి

- హరితహారం చెట్లను ఎందుకు నరుకుతున్నారని ప్రశ్నించిన బాధితుడు
- పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు

చేవెళ్ల, జూన్ 27: హరితహారం కింద నాటిన చెట్లను నరికివేస్తున్న వారిని ప్రశ్నించిన మాజీ సర్పంచ్ భర్త సత్యనారాయణపై విద్యుత్ కాంట్రాక్టర్ సిబ్బంది దాడిచేశారు. ఈ ఘటన గురువారం చేవెళ్ల మండలం న్యాలటలో చోటు చేసుకుంది. బాధితుడు సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. న్యాలటలోభారీగా మొక్కలు నాటగా అవి వృక్షాలయ్యాయి. చేవెళ్ల విద్యుత్ కాంట్రాక్టర్ బాపిరెడ్డి తన సిబ్బందితో గ్రామంలో చెట్లను నరికివేయించారు. దీంతో మొక్కలను ఎందుకు నరుకుతున్నారని సత్యనారాయణ ప్రశ్నించాడు. కాంట్రాక్టర్ తొలగించమని చెప్పాడని సిబ్బంది చెప్పారు. దీంతో సత్యనారాయణ బాపిరెడ్డికి ఫోన్‌చేసి అడగగా తాను చెట్లను నరకమని చెప్పలేదని అన్నారు. ఇంతలో అక్కడ ఉన్న నలుగురు సిబ్బంది కోపంతో సత్యనారాయణపై దాడి చేశారు. ఇది గమనించి గ్రామస్తులు వచ్చే సరికే నలుగురూ పారిపోయారు. బాధితుడు సత్యనారాయణ తనపై జరిగిన దాడిపై విద్యుత్ కాంట్రాక్టర్ బాపిరెడ్డి, అతడి సిబ్బందిపై చేవెళ్ల పోలీసులకు ఫిర్యాదు చేశారు. సిబ్బంది, బాపిరెడ్డిపై కఠినచర్యలు తీసుకోవాలని న్యాలట గ్రామస్తులు కోరారు.

పొలాల్లో ఫార్మా కంపెనీలొద్దు

● మహారాష్ట్ర ప్రభుత్వ ప్లానింగ్ కమిషన్ మాజీ సభ్యుడు హెచ్‌ఎం దేశ్‌రథ


రైతులతో మాట్లాడుతున్న హెచ్‌ఎం దేశ్‌రథ

యాచారం, జూన్ 27: పంట పొలాల్లో ప్రభుత్వాలు ఫార్మాసిటీ, మెగాటౌన్‌షిప్‌లు ఏర్పాటుచేస్తే వాతావరణం కలుషితమై, పర్యావరణ సమతుల్యత దెబ్బతింటుందని, వ్యవసాయ ఉత్పాదకత పడిపోతుందని మ హారాష్ట్ర ప్రభుత్వ ప్లానింగ్ కమిషన్ మాజీ సభ్యుడు దేశ్‌రథ అన్నారు. గురువారం మేడిపల్లి, నానక్‌నగర్, తాటిపర్తి, కుర్మిద్ద గ్రామాల్లో పర్యావరణవేత్త కవుల సరస్వతితో కలిసి పర్యటించి సమస్యలు తెలుసుకున్నా రు. టౌన్‌షిప్‌లు అన్నం పెట్టవని, విత్తనాలు నాటితే పది మందికి అ న్నం ఉత్పత్తి అవుతుందన్నారు. గత ప్రభుత్వం ఫార్మాసిటీకి వందలాది ఎకరాల తీసుకోవడం సిగ్గుచేటన్నారు. రైతులకు విత్తనాలు పంపిణీ చే సుంటే ఆహార ఉత్పాదకత పెరిగేదని, వేలాది మందికి ఉపాధి లభించేదన్నారు. ఇక్కడ మెగాటౌన్‌షిప్ ఏర్పాటు నిర్ణయం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎందుకు తీసుకున్నారో అర్థం కావడంలేదన్నారు. ఫార్మాసిటీ, మెగాటౌన్షిప్‌లను వెంటనే రద్దుచేయాలని డిమాండ్ చేశారు. సీఎం భూమి లేని పేదలకు పంచి ఆదుకోవాలని కోరారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

● వైద్యుల నిర్లక్ష్యమని బంధువుల ఆందోళన

షాద్‌నగర్, జూన్ 27 : షాద్‌నగర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ వ్యక్తి చనిపోయాడు. వైద్యుల నిర్లక్ష్యం వల్లే చనిపోయాడని మృతుడి కుటుంబీకులు గురువారం ఆస్పత్రి వద్ద ఆందోళన చేపట్టారు. కేశంపేట మండలం నర్వకు చెందిన చిర్ర మహేష్ షుగర్ వ్యాధితో బాధపడేవాడు. కుటుంబీకులు అతన్ని ఆస్పత్రిలో చేర్పించారు. వారం రోజులు చికిత్స అందించిన వైద్యులు కిడ్నీల సమస్య ఉందని, హైదరాబాద్‌లోని మహావీర్ ఆస్పత్రికి తరలించాలని సూచించారు. మహేష్‌ను అక్కడికి తరలించగా డయాలసిస్ చేశారని, ఆ మరుసటి రోజే మృతిచెందాడని తెలిపారు. తమకు న్యాయం చేయాలని ఆందోళన చేశారు.

మైసిగండి ఆలయానికి రూ.40.56లక్షల ఆదాయం


ఆలయంలో వేలం నిర్వహిస్తున్న ఎండోమెంట్ అధికారులు

కడ్తాల్, జూన్ 27: మండల పరిధిలోని మైసిగండి మైసమ్మ ఆలయ ఆవరణలో గురువారం పలు వేలం పాటలు నిర్వహించారు. దేవాదాయ శాఖ జిల్లా ఇన్‌స్పెక్టర్ ప్రణీత్‌కుమార్ పర్యవేక్షణలో ఫౌండర్‌ట్రస్టీ సిరోలి పంతూ, ఈవో స్నేహలత సమక్షంలో వేలం చేపట్టారు. 2024-25 సంవత్సరానికి శాక్తేయ మొక్కుబడుల రశీదు రుసుము వసూళ్ల చేసుకునే హక్కు వేలంలో ముగ్గురు పాల్గొన్నారు. మైసిగండికి చెందిన దేపావత్ రవి రూ.25,15,000కు వేలాన్ని దక్కించుకున్నట్లు ఈవో తెలిపారు. అలాగే పూలు, పూజ సాజగ్రి అమ్ముకునే హక్కుల ముగ్గురు పాల్గొనగా మైసిగండికి చెందిన ఎం.రాజేశ్ రూ.15,41,000లకు వేలం దక్కించుకున్నాడు. వేలం ఆదాయాన్ని ఆలయ అభివృద్ధికి, భక్తులకు సదుపాయాల కల్పనకు వెచ్చిస్తామని ట్రస్టీ, ఈవోలు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకుడు రామవత్ భాస్కర్, అర్చక సిబ్బంది మాదారం యాదగిరి, బోడ్యానాయక్, కృష్ణ, చంద్రయ్య, రాములు, దేవేందర్, రమాదేవి, శ్రీనివాసులు, అమృనాయక్, పాండునాయక్, గణేశ్‌గౌడ్, సుమన్ పాల్గొన్నారు.

బీమా రంగంలో ఎల్ఐసీకి మించింది లేదు


ఎమ్మెల్సీ ఎన్.నవీన్‌కుమార్‌రెడ్డిని సన్మానిస్తున్న ఎల్ఐసీ అధికారులు

షాద్‌నగర్ అర్బన్, జూన్ 27: బీమా రంగంలో దేశంలో ఎల్ఐసీకి మించిన సంస్థ లేదని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మహబూబ్ నగర్ ఎమ్మెల్సీ నవీన్ కుమార్‌రెడ్డి అన్నారు. సమాజాన్ని ప్రభావితం చేసే ప్రముఖులను కలవాలనే ఎల్ఐసీ కార్యక్రమంలో భాగంగా ఉద్యోగులు, ఏజెంట్లు ఎల్ఐసీ జడ్చర్ల శాఖ సీనియర్ బ్రాంచ్ మేనేజర్ ఎస్.జగన్నాథ్ ఆధ్వర్యంలో గురువారం షాద్‌నగర్‌లో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, నందిగామ మండలం మొదళ్లగూడలో ఎమ్మెల్సీ ఎస్.నవీన్‌కుమార్‌రెడ్డిలను కలిసి సన్మానించారు. ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ మాట్లాడుతూ దేశంలోనే కాకుండా ప్రపంచ దేశాల్లో ఉంటున్న భారతీయులకు ఎల్ఐసీ బీమా రక్షణ కల్పిస్తూ, వారి ఆర్థికాభివృద్ధికి పనిచేస్తూ నంబర్ వన్ స్థానానికి చేరుకుందని అభినందించారు. 60ఏళ్ల లోపు రైతులందరికీ ఐదు లక్షల బీమాను కల్పిస్తూ రైతు కుటుంబాలకు అండగా ఉందని గుర్తుచేశారు. ఏజెంట్లు మూరుమూల గ్రామాల్లో బీమా ఆవశ్యకతపై ప్రజల్లో చైతన్యం తెస్తూ, పొదుపు చేయిస్తూ ఆర్థిక రక్షణను కల్పిస్తున్నారన్నారు. భారతీయ జీవిత బీమా సంస్థ సేవలు మరింత విస్తరించేలా తమ వంతు సమకారం అందిస్తామని శంకర్, నవీన్‌కుమార్‌రెడ్డి చెప్పారు. కార్యక్రమంలో ఎల్ఐసీ బ్రాంచ్ మేనేజర్ మదుసూధన్‌రావు,ఏబీఎం రవీంద్రనాయక్, డీవో సుబ్రహ్మణ్యం, లియాఫీ షాద్‌నగర్ శాఖ ముఖ్య సలహాదారుడు ఎల్.మోహన్‌రెడ్డి, అధ్యక్షుడు కె.రాంచంద్రయ్య, ప్రధాన కార్యదర్శి డి.రాజుగౌడ్, కోశాధికారి సాయిరెడ్డి, ఏజెంట్లు సత్యనారాయణ, యాదయ్య, వెంకటరంగారెడ్డి పాల్గొన్నారు.

సెన్సెక్స్ 79,000 పైకి..
24,000 స్థాయికి నిఫ్టీ

- సరికొత్త ఉన్నత శిఖరాలకు సూచీలు
- నాలుగో రోజూ లాభాల బాటలో మార్కెట్
- రూ.438.41 లక్షల కోట్లకు మదుపరుల సంపద

ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్లో గురువారం రికార్డుల మోత మోగింది. వరుసగా నాలుగో రోజూ ర్యాలీ తీసిన ప్రామాణిక సూచీలు సరికొత్త ఉన్నత శిఖరాలను అధిరోహించాయి. సెన్సెక్స్ తొలిసారిగా 79,000 మైలురాయిని చేరగా.. నిఫ్టీ 24,000 మార్క్‌ను దాటింది. మార్కెట్ దిగ్గజం రిలయన్స్ ఇండస్ట్రీస్‌తో పాటు ఐటీ కంపెనీలైన టీసీఎస్, ఇన్ఫోసిస్ షేర్లలో కొనుగోళ్లు సూచీలను మరింత ముందుకు నడిపించాయి. సెన్సెక్స్ ఒక దశలో 721.78 పాయింట్లు ఎగబాకి 79,396.03 వద్ద సరికొత్త ఆల్‌టైం ఇంట్రాడే రికార్డును నమోదు చేసింది. ట్రేడింగ్ నిలిచేసరికి, సూచీ 568.93 పాయింట్ల లాభంతో 79,243.18 వద్ద స్థిరపడింది. సూచీకిది సరికొత్త జీవితకాల గరిష్ఠ ముగింపు కూడా. నిఫ్టీ సైతం ఒక దశలో 218.65 పాయింట్ల వృద్ధితో 24,087.45 వద్ద ఆల్‌టైం ఇంట్రాడే రికార్డును, చివర్లో 175.70 పాయింట్ల లాభంతో 24,044.50 వద్ద కొత్త జీవిత కాల గరిష్ఠ ముగింపును నమోదు చేసింది.

ఈ మంగళవారం 78,000 స్థాయికి చేరిన సెన్సెక్స్.. కేవలం రెండు ట్రేడింగ్ సెషన్లలోనే మరో 1,000 పాయింట్ల మేర పుంజుకుంది. గత నెల 24న తొలిసారిగా 23,000 మైలురాయిని తాకిన నిఫ్టీ, కేవలం 23 ట్రేడింగ్ సెషన్లలో మరో 1,000 పాయింట్లు వృద్ధిని కనబరిచింది. మార్కెట్ జైత్రయాత్రలో ఈక్విటీ ఇన్వెస్టర్ల సంపదగా పరిగణించే బీఎస్ఈ నమోదిత కంపెనీల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ సైతం సరికొత్త జీవిత కాల గరిష్ఠ స్థాయి రూ.438.41 లక్షల కోట్లకు (5.25 లక్షల కోట్ల డాలర్లు) చేరుకుంది. గడిచిన నాలుగు ట్రేడింగ్ సెషన్లలో సెన్సెక్స్ 2,033.28 పాయింట్లు (2.63 శాతం) పుంజుకోగా.. మార్కెట్ సంపద రూ.3.93 లక్షల కోట్లు పెరిగింది.

వచ్చే నెల 3 నుంచి ఎమ్‌క్యూర్ ఫార్మా ఐపీఓ

అంతర్జాతీయ ప్రైవేట్ ఈక్విటీ దిగ్గజం బెయిన్ క్యాపిటల్ పెట్టుబడులు కలిగిన ఎమ్‌క్యూర్ ఫార్మా తొలి పబ్లిక్ ఆఫరింగ్ (ఐపీఓ) వచ్చేనెల 3న ప్రారంభమై 5న ముగియనుంది. ఐపీఓలో భాగంగా కంపెనీ రూ.800 కోట్ల తాజా ఈక్విటీ జారీతో పాటు ప్రస్తుత ప్రమోటర్లు, వాటాదారులకు చెందిన 1.14 కోట్ల ఈక్విటీ షేర్లను ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) పద్ధతిన విక్రయించనుంది. వచ్చేనెల 10న కంపెనీ తన షేర్లను స్టాక్ ఎక్స్ఛేంజీల్లో నమోదు చేసే అవకాశం ఉంది.

జేపీ మోర్గాన్ బాండ్ ఇండెక్స్‌లోకి భారత ప్రభుత్వ సెక్యూరిటీలు

భారత ప్రభుత్వ బాండ్లు (జీ-సెక్) శుక్రవారం నుంచి జేపీ మోర్గాన్-ఎమర్జింగ్ మార్కెట్ బాండ్ ఇండెక్స్‌లో భాగం కానున్నాయి. వచ్చే 10 నెలల (2024 జూన్ 28 నుంచి 2025 మార్చి 31) కాలంలో ఈ సూచీలో చేరనున్నాయి. నెలకు ఒక శాతం చొప్పున పది నెలల్లో గరిష్ఠంగా సూచీలో 10 శాతం వెయిటేజీ వరకు భారత జీ-సెక్‌లను సూచీలో చేర్చనున్నారు. తద్వారా వచ్చే పది నెలల్లో మన ప్రభుత్వ బాండ్లలోకి కనీసం 2,000-2,500 కోట్ల డాలర్ల మేర విదేశీ పెట్టుబడులు రావచ్చని అంచనా. దాంతో మన జీ-సెక్‌ల రేట్లు తగ్గడంతో ప్రభుత్వానికి రుణ సమీకరణ వ్యయం కూడా తగ్గనుందని విశ్లేషకులు పేర్కొన్నారు.

ఇండియా సిమెంట్స్‌లో అల్ట్రాటెక్ పాగా

రూ.1,900 కోట్లతో 23% వాటా కొనుగోలు

న్యూఢిల్లీ: దేశీయ సిమెంట్ రంగంలో కన్సాలిడేషన్ కొనసాగుతోంది. తాజాగా ఆదిత్య బిర్లా గ్రూప్ కంపెనీ అల్ట్రాటెక్ సిమెంట్.. చెన్నై కేంద్రంగా ఉన్న ఇండియా సిమెంట్స్ ఈక్విటీలో 22.77 శాతం వాటా కొనుగోలు చేసింది. ఇందుకోసం రూ.1,889.27 కోట్లు చెల్లించింది. డీమార్ట్ ప్రమోటర్ రాధాకృష్ణ దమానీ, ఆయన కుటుంబ సభ్యుల నుంచి అల్ట్రాటెక్ 2 బ్లాక్ డీల్స్ ద్వారా ఈ వాటాలు కొనుగోలు చేసింది. ఇందుకోసం మొదటి బ్లాక్ డీల్‌లో ఒక్కో షేరుకు రూ.265 చొప్పున, రెండో బ్లాక్ డీల్‌లో ఒక్కో షేరుకు రూ.285 చొప్పున చెల్లించింది.

ముందు చూపుతోనే: ఇది కేవలం పెట్టుబడి లాభాల కోసం జరిపిన కొనుగోలు అని అల్ట్రాటెక్ చెబుతోంది. అయితే ఇప్పటికే నష్టాల్లో ఉన్న ఇండియా సిమెంట్స్‌ని ఎలాగైనా కైవసం చేసుకునే వ్యూహంతోనే అల్ట్రాటెక్.. ఇండియా సిమెంట్స్ ఈక్విటీలో 23 శాతం వాటా కొనుగోలు చేసిందని భావిస్తున్నారు. గతంలో బీవీ రాజు నిర్వహణలోని రాశి సిమెంట్, విష్ణు సిమెంట్ టేకోవర్ కోసం గతంలో ఇండియా సిమెంట్స్ కూడా ఇదే వ్యూహాన్ని అనుసరించింది. ముందు పెట్టుబడి లాభాల కోసమే అంటూ, ఈ రెండు కంపెనీల ఈక్విటీలో కొంత వాటా కొనుగోలు చేసింది. తర్వాత బీవీ రాజు బంధువుల నుంచి మరింత వాటా కొనుగోలు చేసి ఈ రెండు సంస్థలను కైవసం చేసుకుంది. ఇండియా సిమెంట్ ఈక్విటీలో ఇప్పటికీ ప్రధాన ప్రమోటర్ ఎన్ శ్రీనివాసన్‌కు, ఆయన నిర్వహణలోని ఇన్వెస్ట్‌మెంట్ కంపెనీలకు 28 శాతం వాటా ఉంది. మిగతా 49 శాతం వాటా రిటైల్ మదుపరులు, సంస్థాగత మదుపరుల చేతుల్లో ఉంది.

జియో సేవలు మరింత ప్రియం

27% వరకు టారిఫ్‌ల పెంపు

జూలై 3 నుంచి అమల్లోకి

స్పెక్ట్రమ్ వేలం ముగిసిన మరునాడే వడ్డింపు

జియో బాటలో మిగతా టెల్కోలు!

న్యూఢిల్లీ: టెలికాం రంగంలో టారిఫ్‌ల పెంపు మళ్లీ ప్రారంభమైంది. ముకేశ్ అంబానీ సారథ్యంలోని రిలయన్స్ జియో ఇందుకు నాంది పలికింది. తన ప్లాన్స్‌లోని అన్ని మొబైల్ టారిఫ్స్‌ను 12 నుంచి 27 శాతం వరకు పెంచుతున్నట్టు ప్రకటించింది. ఈ పెంపు జూలై 3వ తేదీ నుంచి అమల్లోకి వస్తుంది. రెండున్నర సంవత్సరాల తర్వాత జియో తన మొబైల్ టారిఫ్స్‌ను పెంచడం ఇదే మొదటిసారి. '5జీ, ఏఐ టెక్నాలజీల్లో పెట్టుబడుల ద్వారా స్థిరమైన అభివృద్ధి కోసం టారిఫ్‌లు పెంచుతున్నాం' అని రిలయన్స్ జియో ఇన్ఫోకామ్ చైర్మన్ ఆకాశ్ అంబానీ ఒక ప్రకటనలో తెలిపారు. అంతేకాకుండా అన్‌లిమిటెడ్ ఉచిత 5జీ సర్వీసులను కొన్ని ప్లాన్స్‌లోని కస్టమర్లకే కంపెనీ పరిమితం చేసింది. స్పెక్ట్రమ్ వేలం ముగిసిన మరుసటి రోజే రిలయన్స్ జియో టారిఫ్‌లు పెంచడం విశేషం. దీంతో మిగతా టెలికాం కంపెనీలు త్వరలోనే రిలయన్స్ జియోను అనుసరించే అవకాశం ఉందని భావిస్తున్నారు.

పెంపు ఇలా: ప్రస్తుతం రూ.15గా ఉన్న ఒక జీబీ డేటా యాడ్ ఆన్ ప్యాక్ ధరను రూ.19కు (27 శాతం) పెంచింది. 75 జీబీ పోస్ట్ పెయిడ్ డేటా ప్లాన్ టారిఫ్‌ను రూ.399 నుంచి రూ.449కి పెంచేసింది. ఇక అత్యంత ప్రజాదరణ పొంది 84 రోజులు చెల్లుబాటయ్యే రూ.666 అన్‌లిమిటెడ్ ప్లాన్ టారిఫ్‌ను రూ.799కి (20 శాతం) పెంచేసింది. ఏడాది పాటు చెల్లుబాటయ్యే వార్షిక పథకాల టారిఫ్‌లనూ రూ.1,559 నుంచి రూ.1,899కి, రూ.2,999 నుంచి రూ.3,599కి పెంచింది. రోజుకి 2 జీబీ లేదా అంతకంటే ఎక్కువ జీబీ ప్లాన్స్‌లో ఉన్న ఖాతాదారులకు అపరిమిత 5జీ డేటా లభిస్తుందని తెలిపింది.



ఉచితంగా రెండు యాప్స్

టారిఫ్‌ల పెంపుతో పాటు తన ఖాతాదారుల కోసం రిలయన్స్ జియో రెండు ప్రత్యేక యాప్స్‌ని అందుబాటులోకి తెచ్చింది. జియో సేఫ్, జియో ట్రాన్స్‌లేట్ అనే ఈ రెండు యాప్స్ ఏడాది పాటు జియో ప్రస్తుత ఖాతాదారులకు ఉచితంగా అందుబాటులో ఉంటాయి. ఇందులో జియో సేఫ్ యాప్ ద్వారా సురక్షితంగా కాల్స్, మెసేజ్‌లు, ఫైల్స్ ట్రాన్స్‌ఫర్‌తో సహా అనేక పనులు చేయవచ్చని తెలిపింది. ఇక కృత్రిమ మేధ (ఏఐ) ఆధారిత జియో ట్రాన్స్‌లేటర్ యాప్ ద్వారా వాయిస్ కాల్స్, వాయిస్ మెసేజ్‌లు, టెక్స్ట్, ఇమేజ్‌లను వివిధ భాషల్లోకి తర్జుమా చేయవచ్చు. కొత్తగా చేరే ఖాతాదారులు మాత్రం ఈ యాప్స్‌కి నెలకు రూ.99 నుంచి రూ.199 వరకు చెల్లించాలి.

2024-25లో ఫార్మా ఎగుమతుల్లో 10% వృద్ధి

రూ.2.6 లక్షల కోట్లుగా నమోదయ్యే చాన్స్

ఫార్మెక్సిల్ డైరెక్టర్ జనరల్ ఉదయ్ భాస్కర్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25)లో భారత్ నుంచి 3,100 కోట్ల డాలర్ల (దాదాపు రూ.2.6 లక్షల కోట్లు) ఫార్మా ఉత్పత్తులు ఎగుమతి కావచ్చని ఫార్మాస్యూటికల్ ఎక్స్‌పోర్ట్ ప్రమోషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (ఫార్మెక్సిల్) అంచనా వేస్తోంది. గత ఆర్థిక సంవత్సరం (2023-24)లో ఫార్మా ఎగుమతులు 2,785 కోట్ల డాలర్లు (రూ.2.32 కోట్లు)గా ఉన్నాయని, 2024-25లో ఇవి 10-12 శాతం వరకు వృద్ధిని నమోదు చేసే అవకాశం ఉందని భావిస్తున్నట్లు ఫార్మెక్సిల్ డైరెక్టర్ జనరల్ ఉదయ్ భాస్కర్ వెల్లడించారు. గురువారం నాడిక్కడ ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్-మే నెలల కాలంలో ఫార్మా ఎగుమతులు 8.85 శాతం వృద్ధితో 435 కోట్ల డాలర్ల నుంచి 473 కోట్లకు పెరిగాయని తెలిపారు. ఎగుమతులపరంగా కొన్ని సవాళ్లు ఎదుర్కొంటున్నప్పటికీ నిర్దేశిత ఎగుమతుల లక్ష్యాలను చేరుకుంటామని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.

ఆఫ్ పేటెంట్ ఔషధాలతో అపార అవకాశాలు

2023 నుంచి 2029 వరకు అంతర్జాతీయంగా 15 బ్లాక్‌బస్టర్ ఔషధాల పేటెంట్ గడువు తీరిపోనుందని, ఈ ఔషధాలతో భారత ఫార్మా పరిశ్రమ అపారమైన అవకాశాలు దక్కించుకునే వీలుందని ఉదయ్ భాస్కర్ తెలిపారు. ఈ ఆఫ్-పేటెంటెడ్ ఔషధాల విలువ దాదాపు 11,200 కోట్ల డాలర్లుగా ఉందని, ఇందులో భారత కంపెనీలు 1,000 కోట్ల డాలర్ల వరకు అవకాశాలను అందుకునే అవకాశం ఉందన్నారు. కాగా ప్రస్తుతం దేశీయ ఫార్మా కంపెనీలు.. అంతర్జాతీయ రెగ్యులేటరీ సంస్థల నుంచి కొన్ని సవాళ్లు ఎదుర్కొంటున్నాయని, చాలా వరకు ఇవి నాణ్యతకు సంబంధించినవిగా ఉంటున్నాయని వివరించారు. అయితే ఈ సమస్యను అధిగమించేందుకు ఫార్మెక్సిల్ ప్రత్యేకంగా చర్యలు తీసుకుంటోందని తెలిపారు.

నట్టేట ముంచే పెట్టుబడి సలహాదారులకు చెక్!

- సెబీ నియంత్రణలోకి ఫైనాన్షియల్ ఇన్‌ఫ్లుయెన్సర్స్
- అన్ రిజిస్టర్డ్ ఫిన్‌ఫ్లుయెన్సర్లకు కొత్త నియమావళి
- డెరివేటివ్స్‌లో స్టాక్స్ ఎంట్రీకి కఠిన నిబంధనలు
- సెబీ బోర్డులో పలు కీలక నిర్ణయాలు



ముంబై: డిజిటల్ మాధ్యమాల ద్వారా ఆర్థిక పెట్టుబడులపై సలహాలిచ్చే ఫైనాన్షియల్ ఇన్‌ఫ్లుయెన్సర్ల (ఫిన్‌ఫ్లుయెన్సర్స్)ను నియంత్రించాలని క్యాపిటల్ మార్కెట్ నియంత్రణ మండలి సెబీ నిర్ణయించింది. అన్‌రిజిస్టర్డ్ ఫిన్‌ఫ్లుయెన్సర్స్ కోసం నియమావళిని విడుదల చేసింది. అన్ రిజిస్టర్డ్ ఫిన్‌ఫ్లుయెన్సర్స్‌తో సెబీ నమోదిత కంపెనీలు, వారి ఏజెంట్లు ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా భాగస్వాములు కాకుండా నిషేధం విధించింది. గురువారం సమావేశమైన సెబీ బోర్డు ఈ ప్రతిపాదనను ఆమోదించింది. పక్షపాతంతో, పక్కదోవ పట్టించే సలహాలిచ్చే ఫిన్‌ఫ్లుయెన్సర్స్‌తో ముప్పు పొంచి ఉన్న నేపథ్యంలో నియంత్రణ మండలి తాజా చర్యలు చేపట్టింది. ఎందుకంటే, పెట్టుబడులు, మదుపు కోసం ఫిన్‌ఫ్లుయెన్సర్ల సలహాలపై ఆధారపడే చిన్న మదుపరుల సంఖ్య గడిచిన కొన్నేళ్లలో భారీగా పెరిగింది. సెబీ కొత్త నియమావళి ఫిన్‌ఫ్లుయెన్సర్లను వారిచ్చే సలహాలకు బాధ్యులుగా, జవాబుదారీగా చేయనుంది. అంతేకాదు, సెబీ రిజిస్టర్డ్ ఇన్వెస్ట్‌మెంట్ అడ్వైజర్లు (ఐఏ), రీసెర్చ్ అనలిస్టులు (ఆర్ఏ) తమ క్లయింట్ల నుంచి రుసుము వసూలు చేసేందుకు క్లోజ్డ్ ఎకోసిస్టమ్‌ను ఏర్పాటు చేయాలని కూడా నియంత్రణ మండలి నిర్ణయించింది.

అప్పు చేసి ఎఫ్ అండ్ ఓ ట్రేడింగ్: బుచ్

ఏదైనా కంపెనీ షేరును డెరివేటివ్ ట్రేడింగ్‌లో చేర్చడం లేదా వైదొలగడానికి సంబంధించిన అర్హత నిబంధనలను సెబీ కఠినతరం చేసింది. నిత్యం తక్కువ టర్నోవర్ కలిగిన స్టాక్స్‌ను ఫ్యూచర్ అండ్ ఆప్షన్స్ (ఎఫ్ అండ్ ఓ) విభాగం నుంచి ఏరివేసేందుకు ఇది దోహదపడనుంది. అంతేకాదు, ఎఫ్ అండ్ ఓ విభాగ ట్రేడింగ్‌పై సమీక్ష జరిపేందుకు సెబీ 15 మంది సభ్యులతో కూడిన నిపుణుల బృందాన్ని ఏర్పాటు చేసింది. ఈ కమిటీ మూడు కోణాల్లో (మార్కెట్ అభివృద్ధి, ఇన్వెస్టర్ల సొమ్ముకు రక్షణ, పొంచి ఉన్న ముప్పులు) ఎఫ్ అండ్ ఓ మార్కెట్‌ను సమీక్షించనుందని బోర్డు భేటీ అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సెబీ చీఫ్ మాధవి పురి బుచ్ తెలిపారు. ఎఫ్ అండ్ ఓ ట్రేడింగ్‌లో రిటైల్ ఇన్వెస్టర్ల పాత్ర పెరగడం ఆర్థిక వ్యవస్థపై ప్రతికూల ప్రభావం చూపవచ్చన్నారు. చిన్న ఇన్వెస్టర్లు అప్పు చేసి మరీ ఎఫ్ అండ్ ఓలో ట్రేడింగ్ నెరుపుతున్నారని, కుటుంబ పొదుపు సొమ్మునూ కరిగించేస్తున్నారని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. ఇది ఏమాత్రం మంచిది కాదన్నారు.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	71,730 ▼	65,750 ▼	94,500 ▼
ముంబై	71,391 ▲	65,394 ▲	87,043 ▲

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

28వ తేదీ



హైదరాబాద్	515	విజయవాడ	520
వరంగల్	517	గోదావరి	515
చిత్తూరు	573	విశాఖపట్నం	525
		దజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	110	విజయవాడ	123
వరంగల్	110	గుంటూరు	123
కరీంనగర్	110	ఒంగోలు	123
మహబూబ్‌నగర్	110	చిత్తూరు	130
కర్నూలు	110	నెల్లూరు	130
విశాఖపట్నం	129	అనంతపురం	123
గోదావరి	123		

ఢిల్లీలోని ఒవైసీ ఇంటినేమ్ ప్లేట్‌పై సిరా చల్లి పారిపోయిన దుండగులు

» ఒవైసీ మండిపాటు.. అమిత్‌షా చేయిస్తున్నారని ఆరోపణ

హైదరాబాద్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): మజ్లిస్ అధ్యక్షుడు, పార్లమెంటు సభ్యుడు అసదుద్దీన్ ఒవైసీకి చెందిన ఢిల్లీలోని ఇంటి ఆవరణలో ఉన్న నేమ్ ప్లేట్‌పై ఇద్దరు దుండగులు సిరా చల్లి పారిపోయారు. ఈ ఘటనకు సంబంధించి సీసీ కెమెరాలో రికార్డు అయిన దృశ్యాలను ఎక్స్‌లో పంచుకుంటూ ఒవైసీ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి వాటిని నిరోధించడంలో ఢిల్లీ పోలీసుల విఫలం అయ్యారని మండిపడ్డారు. కేంద్ర హోం మంత్రి అమిత్‌షా పర్యవేక్షణలోనే ఇవి జరుగుతున్నాయని ఆరోపించారు. ఎంపీలకు తగిన భద్రత ఉంటుందో లేదో స్పష్టం చేయాలని లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాను ప్రశ్నించారు. ఇంటిపై సిరా చల్లడం, రాళ్లు రువ్వి పారిపోవడం పిరికిపందల చర్య అని, ఇలాంటి వాటికి తాను భయపడనని స్పష్టం చేశారు. ధైర్యం ఉంటే నేరుగా తనను ఎదుర్కోవాలని ఒవైసీ సవాల్ విసిరారు.

బియ్యం ఇచ్చేందుకు.. మిల్లర్లకు మరో 90 రోజుల సమయం

హైదరాబాద్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం నుంచి ధాన్యం తీసుకుని బియ్యం(సీఎంఆర్) ఇవ్వని మిల్లర్లకు మరో 90 రోజుల పాటు గడువు ఇస్తూ సర్కారు నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు పౌర సరఫరాల శాఖ కమిషనర్ డీఎస్ చౌహాన్ గురువారం జీవో జారీ చేశారు. ఈ పొడిగింపు 2019-20, 2020-21 యాసంగి సీజన్, 2021-22 వానాకాలం, యాసంగి, 2022-23 వానాకాలం సీజన్ సీఎంఆర్ బకాయిలకు వర్తిస్తుందని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిన సీఎంఆర్ ధరకు 125 శాతం లేదా 12 శాతం వార్షిక వడ్డీ రేటు.. ఇందులో ఏది ఎక్కువైతే అది నగదు రూపంలోనైనా, బియ్యం రూపంలో(స్టేట్ పూల్‌కు)నైనా రికవరీ చేయవచ్చని పేర్కొన్నారు. గడువులోగా ఇవ్వకుండా నిర్లక్ష్యం చేస్తే మిల్లర్లపై క్రిమినల్ చర్యలు తీసుకుంటామని కమిషనర్ హెచ్చరించారు. మిల్లర్లకు ధాన్యం మిల్లింగ్‌కు అనుమతి ఇవ్వకుండా అనర్హత వేటు వేస్తామని స్పష్టం చేశారు. పౌర సరఫరాల శాఖ కమిషనర్, అన్ని జిల్లాల మేనేజర్లు, పౌర సరఫరాల సంస్థ అధికారుల సమన్వయంతో ఈ రికవరీ ప్రక్రియను పర్యవేక్షించనున్నారు.

నిబ్రస్ డ్రోన్లకు డీజీసీఏ ఆమోదం

» భూ సర్వే అవసరాలు తీర్చేలా ఆధునిక ఫీచర్లు



హైదరాబాద్ సిటీ, జూన్ 27(ఆంధ్రజ్యోతి): అధునాతన ఫీచర్లతో భూమి సర్వేకు నిబ్రస్ టెక్నాలజీస్ సంస్థ రూపొందించిన డ్రోన్ సర్వేయాన్ వి1కు డైరెక్టర్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) ఆమోద ముద్ర వేసింది. 1.99 కిలోల బరువుండే ఈ డ్రోన్‌కు అధిక తరంగ ధైర్ఘ్యం (హై రెజుల్యుషన్) కలిగిన 23 మెగా పిక్సల్ కెమెరా అమర్చి ఉంటుంది. ఫలితంగా అత్యంత స్పష్టమైన చిత్రాలు, డేటాను సేకరించగలదు. గంటకు 25 కిలోమీటర్ల వేగంతో గాల్లో ఎగరగలదు. వేగంగా విస్తరిస్తున్న డ్రోన్ టెక్నాలజీ రంగంలో తమ ఉనికి చాటుకునేలా అధునాతన ఉత్పత్తులను రూపొందిస్తున్నట్లు నిబ్రస్ టెక్నాలజీస్ వ్యవస్థాపకుడు శుభం భరన్వాల్ తెలిపారు. సర్వే పరిశ్రమలో సర్వేయాన్ వీ1డ్రోన్ విప్లవాత్మక మార్పులకు కారణమవుతుందనే విశ్వాసం వ్యక్తంచేశారు.

ఆడపిల్ల వద్దంటూ..
ఏడో నెలలో అబార్షన్

తల్లి ప్రాణానికే ముప్పని వైద్యులు చెప్పినా వినని భర్త

» ఆర్ఎంపీ సహాయంతో భార్యకు మామిడితోటలో గర్భస్రావం చేయించి ఆమె ప్రాణాలు బలిగొన్న వైనం

» సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌లో విషాద ఘటన



సూర్యాపేట పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళనకు దిగిన సుహాసిని తల్లిదండ్రులు, బంధువులు



సుహాసిని (ఫైల్)

హుజూర్‌నగర్ / సూర్యాపేట క్రైం, జూన్ 27: భార్య కడుపులో పెరుగుతున్నది ఆడపిల్ల అని తెలిసి గర్భస్రావం చేయించేందుకు సిద్ధపడ్డాడా భర్త! ఏడో నెలలో అబార్షన్ చేస్తే తల్లిప్రాణాలకే ప్రమాదమని వైద్యులు హెచ్చరించినా అతడి మనసు మారలేదు! తెలిసిన ఆర్ఎంపీ సాయంతో.. ఓ వైద్యుణ్ని సంప్రదించి.. అతడి మామిడితోటలో దొంగచాటుగా అబార్షన్ చేయించాడు. ఈ క్రమంలో తీవ్ర రక్తస్రావమై ప్రాణాలు కోల్పోయిందా అభాగ్యురాలు!! సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌లో జరిగిందీ విషాదం. తమకు తెలియకుండా తమ కుమార్తెకు అల్లుడు ఆపరేషన్ చేయించడాన్ని ఆగ్రహిస్తూ తల్లిదండ్రులు గురువారం సూర్యాపేట పోలీసులకు ఫిర్యాదు చేయడంతో విషయం వెలుగుచూసింది. మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ మండలం వెన్నారం గ్రామపంచాయతీ ఆవాసం రాముతండాకు చెందిన సుహాసిని(26)కి చివ్వెంల మండలం ఎంజీనగర్‌తండాకు చెందిన రత్నావత్ హరిసింగ్‌తో ఆరేళ్లక్రితం వివాహమైంది. వీరికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. హరిసింగ్ వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఏడాదిన్నర కిందట సుహాసిని గర్భవతి కాగా.. లింగనిర్ధారణ పరీక్ష చేయించాడు. ఆమె గర్భంలో ఉన్నది ఆడపిల్ల అని తెలియగానే అబార్షన్ చేయించాడు. ఇటీవల ఆమె మరోసారి గర్భం దాల్చడంతో మళ్లీ స్కానింగ్ తీయించాడు. కడుపులో ఉన్నది ఆడశిశువు అని నిర్ధారణ కావడంతో మరోసారి అబార్షన్ చేయించేందుకు జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లాడు. పరీక్షించిన వైద్యురాలు.. ఏడు నెలల గర్భం ఉన్న పరిస్థితుల్లో అబార్షన్ చేయడం వీలు పడదన్నారు. అయినప్పటికీ హరిసింగ్ ఊరుకోలేదు. ఓ ఆర్ఎంపీ సహాయంతో భార్య సుహాసినిని తీసుకుని హుజూర్‌నగర్‌లో ఓ ప్రైవేటు ఆస్పత్రికి వెళ్లాడు. ఆమెకు అబార్షన్ చేసేందుకు ఓ వైద్యుడిని ఒప్పించారు. హుజూర్‌నగర్ పట్టణ సమీపంలో.. ఆ వైద్యుడికి చెందిన మామిడి తోటలో ఉన్న ఆపరేషన్ థియేటర్‌లో ఈ నెల 25వ తేదీన రాత్రిపూట సుహాసినికి అబార్షన్ చేస్తుండగా తీవ్ర రక్తస్రావమైంది. పరిస్థితి విషమిస్తుండటంతో ఆమెను తొలుత కోదాడలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ కూడా వైద్యులు పరిస్థితి బాగాలేదని చెప్పడంతో.. ఖమ్మం తీసుకెళ్లారు. అక్కడినుంచి తిరిగి సూర్యాపేటలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం రాత్రి ఆమె మృతి చెందింది. ఈ విషయాన్ని కుటుంబసభ్యులకు తెలపకుండా అదే రోజు మృతదేహాన్ని ఎంజీనగర్‌తండాకు తీసుకెళ్లాడామె భర్త.

కన్నీరుమున్నీరైన తల్లిదండ్రులు..

సుహాసిని మృతి విషయం తెలుసుకున్న ఆమె తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తూ ఎంజీనగర్ తండాకు వెళ్లారు. తమకు తెలియకుండా తమ కుమార్తెకు ఎలా ఆపరేషన్ చేయిస్తావంటూ అల్లుడితో గొడవపడ్డారు. ఆపరేషన్ చేసిన వైద్యుడిని నిలదీసేందుకు సుహాసిని తల్లిదండ్రులు, బంధువులు హుజూర్‌నగర్‌లోని ప్రైవేట్ ఆసుపత్రికి వెళ్లారు. అక్కడ వైద్యుడు లేకపోవడంతో సిబ్బందితో గొడవపడ్డారు. సాయంత్రం ఐదు గంటల సమయంలో సూర్యాపేట పట్టణానికి వచ్చి స్థానిక ఏరియా ఆసుపత్రిలో సుహాసిని మృతదేహాన్ని ఉంచారు. అనంతరం.. సుహాసిని భర్తపైన, ఆపరేషన్ చేసిన వైద్యుడిపైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తే టౌన్ పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళనకు దిగారు. పోలీసులు వారి ఫిర్యాదు తీసుకుని.. బాధ్యులపై కఠినచర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. ఆ తర్వాత.. చట్ట విరుద్ధంగా అబార్షన్ చేసిన హుజూర్‌నగర్ వైద్యుడితో పాటు, ముగ్గురు ఆర్ఎంపీలు, ఆసుపత్రి అటెండర్లను పోలీసులు అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తున్నారు.

'శ్రీశైలం'లో యూనిట్-4కు మరమ్మతులు!

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జెన్‌కో చర్యలు

త్వరలో టెండర్లు నిర్వహించేందుకు కసరత్తు

హైదరాబాద్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం ఎడమగట్టు జల విద్యుత్ కేంద్రంలోని 4వ యూనిట్‌కు మరమ్మతులు చేపట్టేందుకు జెన్‌కో చర్యలు చేపట్టింది. శ్రీశైలం విద్యుత్ కేంద్రంలో 150 మెగావాట్ల సామర్థ్యంతో కూడిన 6 యూనిట్లు ఉన్నాయి. 2020 ఆగస్టు 20న జలవిద్యుత్ కేంద్రంలో భారీ అగ్ని ప్రమాదం చోటుచేసుకోగా.. తొమ్మిది మంది మృత్యువాత పడ్డారు. ప్రమాదంలో కొన్ని యూనిట్లు పూర్తిగా, మరికొన్ని యూనిట్లు పాక్షికంగా కాలిపోయాయి. 4వ యూనిట్‌కే అత్యధిక నష్టం వాటిల్లింది. దీనికి జర్మనీ కంపెనీ వైత్ ఆధ్వర్యంలో మరమ్మతులు చేశారు. గత ఏడాది జూలైలో 80 గంటలపాటు విద్యుదుత్పత్తి చేసిన తర్వాత ఫాల్ట్ రావడంతో 4వ యూనిట్ మళ్లీ కాలిపోయింది. డిఫెక్ట్ లయబిలిటీ పీరియడ్‌లోనే కాలిపోయినందున ఒప్పందం ప్రకారం సొంత ఖర్చుతో మరమ్మతు చేయాలని 'వైత్' గ్రూపును జెన్‌కో కోరగా, ఆ సంస్థ నిరాకరించింది. 4వ యూనిట్‌కు ఇతర మరమ్మతులు నిర్వహించడం వల్లే ఫాల్ట్ ఏర్పడిందని, తమకు సంబంధం లేదని స్పష్టం చేసింది. ఏడాదిపాటు ఈ వివాదం నడవడంతో మరమ్మతుల అంశం మరుగున పడిపోయింది. అయితే, ఈ విషయమై స్పందించిన రాష్ట్ర ప్రభుత్వం.. మరమ్మతులు చేపట్టాలని జెన్‌కోను ఆదేశించింది. మరమ్మతులకు రూ.3కోట్లు మాత్రమే ఖర్చు కానుండగా, అంతకు ఎన్నో రెట్లు విలువైన జల విద్యుత్తు ఉత్పత్తి చేసుకోవచ్చన్న అంశాన్ని ప్రస్తావించింది. దీంతో మళ్లీ కొత్తగా టెండర్లు నిర్వహించడానికి జెన్‌కో యాజమాన్యం సన్నాహాలు చేస్తోంది. అయితే, మరమ్మతులు పూర్తయి 4వ యూనిట్‌లో ఉత్పత్తి ప్రారంభం కావడానికి కనీసం మూడు నెలలు పడుతుందని, ఆలోగా కృష్ణాలో వరదలు తగ్గుముఖం పడుతాయని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి.

అమెరికాలో తెలుగోళ్ల హవా

» అగ్రరాజ్యంలో పెరుగుతున్న మనోళ్ల సంఖ్య

» 8 ఏళ్లలో నాలుగు రెట్ల పెరుగుదల

» 2016లో 3.2 లక్షలు.. 2024లో 12.3 లక్షలు

» ఆ దేశంలో ఎక్కువ మంది మాట్లాడే 350 విదేశీ భాషల్లో తెలుగుది 11వ స్థానం

హైదరాబాద్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): ఇంట్లో తెలుగు.. వీధిలో తెలుగు.. యూనివర్సిటీలో తెలుగు.. కార్యాలయంలోనూ తెలుగే.. ఇదేదో ఆంధ్రానో, తెలంగాణో అనుకుంటే పొరబడినట్టే! అగ్రరాజ్యం అమెరికాలోని కొన్ని ప్రాంతాల్లో ఇటీవలికాలంలో కనిపిస్తున్న పరిస్థితి ఇది. ఆ దేశంలో ఎక్కువ మంది మాట్లాడే 350 విదేశీ భాషల్లో తెలుగు 11వ స్థానంలో నిలిచింది. అమెరికాలో ఎక్కువగా మాట్లాడే భారతీయ భాషల జాబితాలో మనకన్నా ముందు హిందీ, గుజరాతీ ఉన్నాయి. కొన్నేళ్లుగా.. ఉన్నత విద్య, ఉపాధి కోసం ఇతర దేశాల నుంచి అమెరికాకు చేరుకుంటున్నవారిలో తెలుగువారి జనాభా గణనీయంగా పెరుగుతోంది. అమెరికా ప్రభుత్వం తాజాగా విడుదల చేసిన గణాంకాలు ఈ విషయాన్ని అధికారికంగా స్పష్టం చేస్తున్నాయి. 2016తో పోలిస్తే 2024లో అమెరికాలో ఉంటున్న తెలుగువారి జనాభా నాలుగింతలు పెరిగిందని ఇటీవలే విడుదలైన యూఎస్ సెన్సస్ బ్యూరో డేటా చెబుతోంది. ఆ నివేదిక ప్రకారం..

- 2016లో అమెరికాలో తెలుగు మాట్లాడేవారి సంఖ్య 3.2 లక్షలు ఉండగా..ఇప్పుడది 12.3 లక్షలకు చేరింది.
- తెలుగు జనాభా ఎక్కువగా ఉన్న రాష్ట్రాల్లో క్యాలిఫోర్నియా ప్రథమస్థానంలో ఉంది. అక్కడ 2 లక్షల మంది తెలుగువారున్నారు. తర్వాతటెక్సస్(1.5 లక్షలు), న్యూజెర్సీ(1.1లక్షలు), ఇల్లినాయ్(83 వేలు), వర్జీనియా(78వేలు), జార్జియా(52 వేలు) ఉన్నాయి.
- అమెరికాకు ఏటా వచ్చే మొత్తం విదేశీ విద్యార్థుల్లో తెలుగు విద్యార్థుల వాటా దాదాపు 13 శాతం.
- ఉపాధి కోసం వెళ్లేవారి సంఖ్యలోనూ ఏటా వృద్ధి నమోదవుతోంది. ఇతర దేశాలతో పోలిస్తే భారత్ నుంచి అత్యధికులు అమెరికాకు వెళ్తుండగా.. వీరిలో సింహభాగం తెలుగు రాష్ట్రాల నుంచే ఉంటున్నారు.
- అమెరికాలోని అనేక ప్రముఖ వర్సిటీల్లోని విదేశీ విద్యార్థుల్లో తెలుగు రాష్ట్రాల విద్యార్థుల వాటా పెరుగుతోంది. కెంట్ స్టేట్ వర్సిటీలో మనోళ్ల ప్రవేశాలు ఎక్కువగా ఉండడంతో 'విద్యార్థులకు స్వాగతం' అంటూ తెలుగులో ఆహ్వానం పలకడం పట్ల మన విద్యార్థులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.
- ఏటా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ నుంచి 60 వేల నుంచి 70 వేల మంది విద్యార్థులు, 10 వేల మందికి పైగా హెచ్1బీ వీసాపై అమెరికాకు చేరుకోవడమే అక్కడ మన హవా ఇంతగా పెరగడానికి ప్రధాన కారణం. ఇండియన్ మొబిలిటీ రిపోర్ట్-2024 ప్రకారం.. చదువుకోవడానికి అమెరికా వెళ్తున్న భారతీయ విద్యార్థుల్లో మన తెలుగువారి వాటా ఏకంగా 12.5 శాతం!!

మాతృ భాష	2010	2021	వృద్ధి (శాతం)
తెలుగు	217641	459836	111.00%
తమిళం	181698	341396	88.00%
బెంగాలీ	221872	403024	82.00%
నేపాలీ, మరాఠీ, ఇండో-ఆర్యన్ భాషలు	275694	447811	63.00%
హిందీ	609395	864830	42.00%
మళయాళం, కన్నడ, ఇతర ద్రావిడ భాషలు	197550	280188	42.00%
ఉర్దూ	388909	507972	31.00%
పంజాబీ	243773	318588	31.00%
గుజరాతీ	356394	436909	23.00%

వృద్ధిరేటులో మనమే..

అమెరికాలో ఉండే అన్ని దేశాలవారు, జాతులవారు బయట మాట్లాడేది ఆంగ్లమైనా.. ఇంట్లో మాట్లాడేది మాత్రం మాతృభాషే. అలా ఆ దేశంలో ఉంటున్న భారతీయుల్లో.. ఇంట్లో మాతృభాష మాట్లాడే వారి సంఖ్య పెరుగుదలలో తెలుగువారిదే అగ్రస్థానం. 2010లో అక్కడ 2.17 లక్షల మంది ఇంట్లో తెలుగు మాట్లాడుతుండగా.. 2021 నాటికి వారి సంఖ్య 111 శాతం వృద్ధి రేటుతో 4.59 లక్షలకు చేరింది

ప్రారంభానికి నోచని పల్లె దవాఖానా

● నెలల కిందట నిర్మాణం పూర్తి ● ప్రారంభం కాని వైద్య సేవలు ● ప్రభుత్వ భూమిని ప్రైవేట్ వ్యక్తికి ధారదత్తం చేసే యత్నం?


కీసర శివారులో నిర్మించిన పల్లె దవాఖానా

కీసర, జూన్ 27: మండల కేంద్రంలో పల్లె దవాఖానా ప్రారంభానికి నోచుకోవడం లేదు. నిర్మాణం పూర్తై నెలలు గడుస్తున్నా ప్రజలకు పల్లె దవాఖానాలో వైద్యసేవలు అందుబాటులోకి రావడంలేదు. వివరాల్లోకి వెళ్తే.. మండల కేంద్రం కీసరలో కేంద్ర ప్రభుత్వం పథకం ఆయుష్మాన్ భారత్ కింద పల్లె దవాఖానాను నిర్మించారు. నిర్మించి నెలలు గడుస్తున్న ప్రజలకు పల్లె దవాఖానాలో వైద్యసేవలు అందించడంలేదు. లక్షలు వెచ్చించి నిర్మించిన భవనం ప్రజలకు అందుబాటులోకి తీసుకురాకపోవడంపై సంబంధిత అధికారులపై పలువురు విమర్శలు గుప్పిస్తున్నారు. అసలు పల్లె దవాఖానా నిర్మించిన చోటు సరైనదేనా అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. జనవాసాలకు దూరంగా ప్రధానరోడ్డుకు దగ్గరగా నిర్మించడం పట్ల సర్వత్రా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కీసర నుంచి కీసరగుట్టకు వెళ్లే ప్రధాన రోడ్డు, శ్రీ మల్లికార్జున స్వామి ఆలయం ఎదురుగా ఉన్న ప్రభుత్వ భూమిలో పల్లె దవాఖానాను నిర్మించారు. నిర్మించిన చోటుకు, గ్రామానికి దాదాపు 2కిలోమీటర్లు ఉంటుంది. జనవాసాలకు దూరంగా, మెయిన్‌రోడ్డుకు ఆనుకొని పల్లె దవాఖానాను నిర్మించారు. మెయిన్‌రోడ్డుపై నిత్యం భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. జనాలు ఉన్న చోటు నుంచి రోజూ వృద్ధులు, దివ్యాంగులు, గర్భిణులు అంత దూరం వెళ్లడానికి చాలా ఇబ్బందిగా ఉంటుంది. నిధులు వృథా చేశారని, దీనికి ముఖ్య కారణం గత పాలకుల బలవంతపు నిర్ణయమే పెద్ద కారణమని పలువురు ఆరోపిస్తున్నారు.

దవాఖానా వెనుక పెద్ద కుంభకోణం?

ప్రభుత్వ భూమిలో పల్లె దవాఖానాను నిర్మించగా ఈ భూమికి ఆనుకొని కీసర గ్రామానికి చెందిన ప్రైవేట్ వ్యక్తి స్థలం కొద్దిగా ఉంది. ఇదిలా ఉండగా పల్లె దవాఖానా నిర్మాణం పూర్తయ్యాక అక్కడ కొంత స్థలం మిగిలిఉంది. మిగిలినస్థలం మెయిన్‌రోడ్డుకు కనీసం 500గజాలకు పైగా ఆనుకొని ఉంటుంది. మెయిన్‌రోడ్డుపై గజానికి దాదాపు 60 నుంచి 70వేలు పలుకుతుంది. మిగిలిన ప్రభుత్వ భూమి ప్రైవేట్ వ్యక్తికి అనుకూలంగా మారుతుందని ఉద్దేశ్యంతో గత పాలకులు పల్లె దవాఖానాను అక్కడ నిర్మించారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇలా చేయడం వల్ల ప్రైవేట్ వ్యక్తి నుంచి గత పాలకులు పెద్దమొత్తంలో ముడుపులు తీసుకున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పల్లె దవాఖానా నిర్మాణం వెనుక పెద్దకుంభకోణం జరిగిందని గ్రామస్థులు వాపోతున్నారు.

ప్రహరీ నిర్మించాలని డిమాండ్

ఆసుపత్రి అంటే జనాలు ఉపయోగపడే విధంగా నిర్మించాలి గానీ, అలా జనాలకు దూరంగా నిర్మించడం పట్ల గ్రామస్థులు అధికారుల పనితీరుపై, గత పాలకుల తీర్మానంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పాలకుల నిర్ణయానికి, అధికారుల పనితీరుతో నిర్మాణం అయిన పల్లె దవాఖానా ఇకనైనా ప్రారంభించాలని, కోరారు. అక్కడ మిగిలిన ప్రభుత్వ స్థలాన్ని గుర్తించి ప్రహరీ నిర్మించి రూ.కోట్ల విలువైన ప్రభుత్వ భూమిని కాపాడాలని కీసర గ్రామస్థులు అధికారులను కోరుతున్నారు.

ప్రమాదకరంగా ఫ్లెక్సీలు

● మొద్దునిద్రలో మున్సిపల్ అధికారులు

వికారాబాద్, జూన్ 27: మున్సిపల్ అధికారులు అధికారంలో ఉన్న నాయకులను చూసి పనిచేస్తారా? అంటే అవుననే సమాధానం వినిపిస్తుంది. వికారాబాద్ జిల్లా కేంద్రంలో తెలంగాణ రాష్ట్ర స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ జన్మదిన సందర్భంగా అభిమానులు నాయకులు రోడ్ల వెంబడి ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలంటే మున్సిపల్ అధికారుల అనుమతులు తీసుకోవాల్సి ఉంటుంది. అయితే నిబంధనలను ఏ నాయకుడూ పట్టించుకోవడంలేదు. గతంలో బీఆర్ఎస్ నాయకులు సైతం ఇలాగే ఫ్లెక్సీలు కట్టినా ఇదే పరిస్థితి. ప్రస్తుతం కాంగ్రెస్ నాయకులు, బీజేపీ నాయకులు కట్టిన మున్సిపల్ అధికారులకు కనిపించనట్లు వ్యవహరిస్తున్నారు. మున్సిపల్ అధికారులు లోకల్ లీడర్లకు భయపడి నెల రోజులు గడుస్తున్నా రోడ్డుపై అడ్డంగా, ప్రమాదకరంగా ఉన్న ఫ్లెక్సీలను తొలగించడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్రధాన చౌరస్తాలో విగ్రహాల చుట్టూ ఫ్లెక్సీలు కట్టడం చౌరస్తాల వద్ద పెద్ద ఫ్లెక్సీలు రౌండ్ షేపులో పెట్టడంతో ఏ వైపు నుంచి ఏ వాహనం వస్తుందో అర్థం కాని పరిస్థితులు నెలకొన్నాయి. దీనికి తోడు అసలే వర్షాకాలం, పైగా ఈదురు గాలులు ఏ సమయంలో ఏ ఫ్లెక్సీ ఊడిపడి వాహనదారులపై, పాదచారులపై పడుతుందో అంటూ ప్రయాణికులు భయంతో వెళ్తున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు పట్టణం మొత్తం ఉన్న ఫ్లెక్సీలను తొలగించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.


వికారాబాద్ ఎన్టీఆర్ చౌరస్తాలో ఫ్లెక్సీలు

'అనురాగ్'లో టెక్-హ్యాక్ పోస్టర్ ఆవిష్కరణ

ఘట్‌కేసర్ రూరల్, జూన్ 27: వెంకటాపూర్ అనురాగ్ యూనివర్సిటీలో గురువారం టెక్-హ్యాక్-3 ప్రోగ్రాం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి అనురాగ్ స్కూల్ ఫ్ కంప్యూటర్ సైన్స్ డీన్ విష్ణుమూర్తి ముఖ్యఅతిథిగా పాల్గొని పోస్టర్‌ను ఆవిష్కరించారు. టెక్ హ్యాక్-3 హ్యాకథాన్ కాదని 36గంటల పరివర్తన అనుభవమని వ్యాఖ్యానించారు. ఈకార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.


పోస్టర్ ఆవిష్కరిస్తున్న అధ్యాపకులు

ప్రొఫెసర్ మల్లేష్‌కు అవార్డు

ఘట్‌కేసర్ రూరల్: వెంకటాపూర్ అనురాగ్ యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ మల్లేషకు మహాత్మాగాంధీ యూనివర్సిటీ ఉత్తమ పరిశోధనాపత్రం అవార్డు లభించింది. ఈ మేరకు మహాత్మాగాంధీ యూనివర్సిటీలో టీఎసీ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయస్థాయి కాన్ఫరెన్స్‌లో ఏఐని ఉపయోగించి బ్యాంకింగ్ డిజిటల్ ఫ్రాడ్ డిటెక్షన్ అండ్ ప్రివెన్షన్ రూపొందించినందుకు గానూ ఆయనకు ఈ అవార్డు లభించింది. కార్యక్రమంలో విశ్వనాథ, ప్రాజెక్ట్ సీఎండీ శివకుమార్, ప్రొఫెసర్లు పురుషోత్తం, చెన్నప్ప పాల్గొన్నారు.

క్రైం కార్నర్

బైక్ ఢీకొని వ్యక్తి మృతి

పరిగి,జూన్ 27: రోడ్డు గుండా నడుచుకుంటూ వెళుతున్న వ్యక్తిని బైక్ ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. కొడంగల్ మండలం సంగాయపల్లి గ్రామానికి చెందిన కుర్వ మల్లప్ప(60) పరిగి మండలం గడిసింగాపూర్‌లోని మామిడి తోటలో పనిచేస్తుంటాడు. గురువారం తోట నుంచి గ్రామానికి వచ్చి తిరిగి వెళ్తుండగా వెనుక నుంచి బైక్ అతివేగంగా వచ్చి ఢీకొంది. ఈ ప్రమాదంలో మల్లప్పకు వెనుక నుంచి వచ్చిన మరో ఆటో కూడా తగిలింది. దీంతో తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి కూతురు మంజుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సంతోష్ తెలిపారు.

యువతిని వ్యభిచార వృత్తిలోకి తీసుకొచ్చిన వ్యక్తికి 9 ఏళ్ల జైలు

మేడ్చల్ టౌన్, జూన్ 27: ఆర్థిక పరిస్థితులను ఆసరాగా చేసుకుని యువతిని వ్యభిచార వృత్తిలోకి లాగి డబ్బులు సంపాదించే ఓవ్యక్తిని మేడ్చల్ అసిస్టెంట్ సేషన్ న్యాయస్థానం తొమ్మిదేళ్ల జైలు శిక్షను విధిస్తూ తీర్పునిచ్చింది. మేడ్చల్ న్యాయస్థానం పబ్లిక్ ప్రాసిక్యూటర్ కృష్ణమూర్తి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. జీడిమెట్ల టీఎస్ఐఐసీ కాలనీకి చెందిన వీరరాజు(36) 2022 సంవత్సరంలో ఓ యువతిని ఆమె ఆర్థిక పరిస్థితులను ఆసరాగా చేసుకుని వ్యభిచార వృత్తిలోకి దింపి ఆమెతో వ్యభిచార గృహాన్ని నడిపాడు. విషయం తెలుసుకున్న పోలీసులు వ్యభిచార గృహంపై దాడిచేయగా విటుడు శ్రీకాంత్‌తో పాటు యువతిని అదుపులో తీసుకుని విచారించగా ఆమెను వీరరాజు డబ్బుల కోసం వ్యభిచార వృత్తిలో దింపినట్లు తెలిసింది. అనంతరం పోలీసులు ముగ్గురిని మేడ్చల్ అసిస్టెంట్ సేషన్‌జడ్జి ముందు హాజరుపరిచారు. కేసుకు సంబంధించి పూర్వాపరాలను పరిశీలించిన అనంతరం న్యాయాధికారి అజయ్ జాదవ్ గురువారం వీరరాజుకు తొమ్మిదేళ్లు, శ్రీకాంత్‌కు మూడేళ్ల జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు.

హత్యకేసులో ఇద్దరు నిందితుల రిమాండ్


రాములు


రాజు

ఘట్‌కేసర్ రూరల్, జూన్ 27: ఘట్‌కేసర్ మాజీ ఎంపీటీసీ గడ్డం మహేష్ హత్యకేసులో పరారీలో ఉన్న ఇద్దరు నిందితులను ఘట్‌కేసర్ పోలీసులు గురువారం సాయంత్రం రిమాండ్‌కు తరలించారు. సీఐ సైదులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈనెల 15న ఘట్‌కేసర్ మాజీ ఎంపీటీసీ గడ్డం మహేష్‌ను దారుణంగా హత్యచేసి కొండాపూర్ డంపింగ్‌యార్డులో పాతిపెట్టడానికి ప్రధాన నిందితులకు సహకరించి, సలహాలిచ్చిన మరో ఇద్దరు నిందితులను అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించారు. ఘట్‌కేసర్‌కు చెందిన కడుపోల్ల శ్రీరాములు(44), తోక రాజు (23)లను ఘట్‌కేసర్ మున్సిపల్, ఎన్ఎఫ్‌సీనగర్‌లో బుధవారం రాత్రి అదుపులోకి తీసుకున్నారు. విచారణ చేపట్టిన పోలీసులు గురువారం సాయంత్రం రిమాండ్‌కు తరలించి కేసు నమోదు చేసుకున్నట్లు సీఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

మోమిన్‌పేట్, జూన్ 27: ఎదురెదురుగా కారు, బైక్ ఢీకొనగా ఓ వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. ఘటన మోమిన్‌పేట్ మండల కేంద్రంలో జరిగింది. 108 సిబ్బంది తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మొరంగపల్లి గ్రామానికి చెందిన గోపాల్ మోమిన్‌పేట్‌లో పని ముగించుకొని సొంత గ్రామానికి బైక్‌పై వెళ్తున్నాడు. ఈ క్రమంలో అదే గ్రామానికి చెందిన నారాయణ కారులో మొరంగపల్లి నుంచి మోమిన్‌పేట్‌కు వస్తుండగా మోమిన్‌పేట్ మండల కేంద్రంలోని రాయల్ ఫంక్షన్ హాల్ సమీపంలో ఎదురెదురుగా కారు, బైక్ ఢీకొనగా గోపాల్‌కు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స కోసం 108 వాహనంలో సంగారెడ్డి ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు సిబ్బంది తెలిపారు.

'బీర్ల ఐలయ్యకు మంత్రి పదవి ఇవ్వాలి'

కొడంగల్ రూరల్, జూన్ 27: ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్యకు క్యాబినెట్‌లో మంత్రి పదవి ఇవ్వాలని వికారాబాద్ జిల్లా కురుమ సంఘం కార్యదర్శి ఆర్.నాగప్ప, మాజీ ఎంపీపీ రుద్రారం నర్సింహులు, దస్తప్ప, కురువ దస్తప్ప, మల్లప్ప, రాంచందర్, భాస్కర్, నర్సింహులు, సి.బాల్‌రాజ్, వెంకటయ్య, మధు తదితరులు గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. తెలంగాణలో 40 లక్షలకు పైగా జనాభా ఉండగా, బీసీల ముద్దబిడ్డ కురుమ సామాజిక వర్గానికి చెందిన బీర్ల ఐలయ్యకు మంత్రి పదవీ ఇవ్వాలని కోరారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు

పరిగి, జూన్ 27: పరిగిలో తాగునీటి సమస్య పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని పరిగి మునిసిపల్ చైర్మన్ ఎం.అశోక్ అన్నారు. మునిసిపల్ పరిధిలోని 14వ వార్డులో గురువారం చెడిపోయిన బోర్లను దగ్గర ఉండి మరమ్మతులు చేయించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఇ.కృష్ణ, తాహేర్ అలీ తదితరులు పాల్గొన్నారు.

గెస్ట్ లెక్చరర్లకు దరఖాస్తుల ఆహ్వానం

పరిగి, జూన్ 27: పరిగిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గెస్ట్ లెక్చరర్లకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ రాజారామ్ ఒక ప్రకటనలో తెలిపారు. 2024-25 విద్యాసంత్సరంలో బోధించాల్సి ఉంటుందని తెలిపారు. తొమ్మిది ఖాళీలు ఉన్నాయని, తెలుగు, ఆంగ్లం, పొలిటికల్‌సైన్స్, హిస్టరీ, ఎకనామిక్స్, కామర్స్, కంప్యూటర్ అప్లికేషన్, జువాలజీ, గణితం సబ్జెక్టులు బోధించడానికి దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఎస్సీ,ఎస్టీలు పీజీలో 50శాతం, ఇతరులైతే 55శాతం మార్కులు కలిగి ఉండాలని సూచించారు. అభ్యర్థులు, నెట్, సేట్, స్లేట్, పీహెచ్‌డీ ఉంటే ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు. పూర్తి వివరాలకు 9701774143ను సంప్రదించాలని సూచించారు.

● కొడంగల్ రూరల్: కొడంగల్ ప్రభుత్వ కళాశాలలో తెలుగు, ఎకానామిక్స్, పొలిటికల్ సైన్స్, కామర్స్, జువాలజీ, కంప్యూటర్ సైన్స్, కంప్యూటర్ అప్లికేషన్స్ బోధించేందుకు గెస్ట్ ఫ్యాకల్టీ కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ రాజారాం గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 29 వరకు గడువు ఉంటుందని, అభ్యర్థులు యంఏ ఎంఎస్సీలో 55 శాతం మార్కులు కలిగి ఉండాలని తెలిపారు.

తాండూరు: తాండూరు ప్రభుత్వ డిగ్రీత కళాశాలలో గెస్ట్‌లెక్చరర్లుగా పనిచేయడానికి అర్హులైన వారు జూలై 1 సాయంత్రం 4 గంటల లోపు కళాశాలలో దరఖాస్తులు సమర్పించుకోవాలని ప్రిన్సిపాల్ డాక్టర్ వివేక్ కుమార్ దూబే కోరారు. ఇంగ్లీష్, తెలుగు, వాణిజ్య శాస్త్రం, రాజనితి శాస్త్రం, గణిత శాస్త్రం, కంప్యూటర్ సైన్స్, జంతు శాస్త్రం బోధించడానికి అధ్యాపకులు అవసరమని తెలిపారు.

సీలింగ్ భూములను పేదలకు పంపిణీ చేయాలి

పరిగి, జూన్ 27: మండలంలోని మిట్టకోడూరులోని ప్రభుత్వ సీలింగ్ భూములను పేదలకు పంపిణీ చేయాలని కోరుతూ సీపీఐ ఆధ్వర్యంలో గురువారం వికారాబాద్ ఆర్డీవో వాసుచంద్రకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సీపీఐ డివిజన్ కార్యదర్శి ఫీర్‌ఆహ్మద్ మాట్లాడుతూ.. మిట్టకోడూరులో ఉన్న ప్రభుత్వ సీలింగ్ భూములను గుర్తించి ఒక్కొక్కరికి మూడెకరాల చొప్పున పంపిణీ చేయాలని కోరారు. లేదంటే త్వరలో సీపీఐ ఆధ్వర్యంలో జెండాలను పాతుతామని హెచ్చరించారు. వినతిపత్రం ఇచ్చినవారిలో సీపీఐ నాయకులు యాదయ్య, రాంచంద్రయ్య, వెంకటయ్య, బందెయ్య ఉన్నారు.

బడుగు, బలహీన వర్గాల సంక్షేమానికి పెద్దపీట


లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేస్తున్న స్పీకర్ ప్రసాద్‌కుమార్, ఎమ్మెల్యే యాదయ్య

నవాబుపేట, జూన్ 27: సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో బడుగు, బలహీన వర్గాల సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నట్లు అసెంబ్లీ స్పీకర్ ప్రసాద్ కుమార్, చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. మండల కేంద్రంలో వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను వారు గురువారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల నియోజకవర్గ ఇన్‌చార్జి భీమ్‌భరత్, మండల అధ్యక్షుడు మేడిపల్లి వెంకటయ్య, మధుసూదన్‌రెడ్డి, రామ్‌రెడ్డి, చిట్టెపు మల్లారెడ్డి, మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

పీసీఎం తండాలో బోర్ డ్రిల్

ధారూరు: పీసీఎం తండాలో తాగునీటి సౌకర్యం కల్పించేందుకు కొత్త బోర్ వేయించారు. శాసనసభ స్పీకర్ జి.ప్రసాద్‌కుమార్ తండావాసులకు ఇచ్చిన హామీ మేరకు గురువారం తండాలో కాంగ్రెస్ నాయకులు బోర్‌ను డ్రిల్ చేయించారు. కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు కె.విజయభాస్కర్‌రెడ్డి కొబ్బరికాయ కొట్టి బోర్‌డ్రిల్‌ను ప్రారంభించారు. తండాలో బోర్ వేయించటంతో తండావాసులు సంతోషం వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అనంతయ్య, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

స్పీకర్‌ను కలిసిన ఊట్ల బాలకిష్టయ్య

వికారాబాద్: టీపీసీసీ ఓబీసీ సెల్ రాష్ట్ర నేత ఊట్ల బాలకిష్టయ్య నేత గురువారం అసెంబ్లీ స్పీకర్ ప్రసాద్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన పార్టీ కోసం పని చేస్తున్న నాయకులకు రాష్ట్ర, జిల్లా నామినేటెడ్ పదవుల్లో ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు.

రక్తహీనతను సమూలంగా తగ్గించాలి


మాట్లాడుతున్న చైర్‌పర్సన్ మంజుల

వికారాబాద్, జూన్ 27: విద్యార్థులకు ప్రతీ గురువారం ఐరన్ అండ్ ఫోలిక్ యాసిడ్ టాబ్లెట్‌ను వేసి వారిలో ఉన్న రక్తహీనతను సమూలంగా తగ్గించే దిశగా ముందుకు వెళ్లాలని వికారాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ చిగులపల్లి మంజుల రమేష్ అన్నారు. గురువారం జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ ఆదేశాల మేరకు రిక్షా కాలనీలోని కేజీబీవీ బాలికల పాఠశాలలోని విద్యార్థులకు ఐరన్ అండ్ ఫోలిక్ యాసిడ్ టాబ్లెట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో జీవరాజ్, డీఐవో బుచ్చిబాబు, మెడికల్ అధికారులు డాక్టర్ నిఖిల్, డాక్టర్ సృజన, జీసీడీవో శ్రీదేవి, స్కూల్ ప్రిన్సిపాల్ స్వరూప, విద్యార్థులు, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

కులకచర్ల: కులకచర్ల, చౌడాపూర్ మండలాల్లోని పలు పాఠశాలలోల్లాఇ విద్యార్థినిలకు గురువారం స్థానిక ప్రభుత్వాసుపత్రి వైద్యాధికారి వాజిహుద్దీన్, మాధురి, సీహెచ్‌వో చంద్రప్రకాశ్‌లు ఐరన్‌ఫోలిక్ యాసిడ్ మాత్రలను వేశారు. కలెక్టర్ ఆదేశానుసారం 11 సంవత్సరాల నుంచి 17 సంవత్సరాల వయసు గల ఆడ పిల్లలకు ఈ మాత్రలు వేస్తున్నట్లు తెలిపారు.

ఉత్తమ సేవలకు గుర్తింపు

కులకచర్ల, జూన్ 27: విధి నిర్వాహణలో ఉత్తమ సేవలందించిన ప్రతీ ఒక్కరికి పదవీ విరమణ అనంతరం సమాజంలో గుర్తింపు లభిస్తుందని ఎంపీపీ సత్యహరిశ్చంద్ర, జడ్పీటీసీ రాందాస్‌నాయక్ అన్నారు. చౌడాపూర్ ప్రాథమిక పాఠశాల ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎం రాములు పదవీ విరమణ కార్యక్రమాన్ని గురువారం పాఠశాల ఆవరణలో నిర్వహించారు. ఆయనను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవోలు హబీబ్ అహ్మద్, హరిశ్చంద్ర, సొసైటీ చైర్మన్ నాగరాజు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అశోక్‌కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నిధులు కేటాయించాలి


కడా ప్రత్యేకాధికారికి వినతిపత్రం అందజేస్తున్న మైనారిటీ నాయకులు

కొడంగల్, జూన్ 27: మొహర్రం ఉత్సవాల్లో భాగంగా కొడంగల్ పట్టణంలో శిథిలావస్థలో ఉన్న నాలుగు పీర్ల మసీద్‌ల పునర్నిర్మించడానికి నిధులు కేటాయించాలని మైనారిటీ నాయకులు కోరారు. కొడంగల్‌లో కడా ప్రత్యేకాధికారికి గురువారం వారు కలిసి వినతి పత్రం అందజేశారు. పీర్ల మసీద్‌ల నిర్మాణానికి రూ.20లక్షల ఖర్చు అవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మైనారిటీ నాయకులు ఎస్ఎం.గౌసన్, ఆసిఫ్ ఖాన్, సయ్యద్ ఇసాక్‌పాష, ఎండీ.అబ్దుల్, ఎండీ. జావీద్, షేక్ రుమాన్, ఎండీ.రిజ్వాన్, షేక్ ఆదిల్ తదితరులు పాల్గొన్నారు.

మత్తుపదార్థాలు విక్రయించే వారితో జాగ్రత్త


మాట్లాడుతున్న సీఐ సత్యనారాయణ

మేడ్చల్ టౌన్, జూన్ 27: మత్తు పదార్థాలు విక్రయించే వారి పట్ల విద్యార్థులు జాగ్రత్తగా ఉండాలని మేడ్చల్ సీఐ సత్యనారాయణ అన్నారు. మత్తు పదార్థాల పట్ల మేడ్చల్ పోలీసులు కళాశాలల విద్యార్థులకు చేపట్టిన అవగాహన కార్యక్రమంలో భాగంగా మేడ్చల్ పట్టణ కిష్టాపూర్ వీఎంఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. యువతరాన్ని తప్పుతోవ పట్టించడానికి విద్యాలయాల పరిసరాల్లో కొందరు మత్తు పదార్థాలను విక్రయించే ప్రయత్నం చేస్తున్నారు. అలాంటి వారితో విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ మురళీధర్, కళాశాల చైర్మన్ వేముల మల్లారెడ్డి పాల్గొన్నారు.

పార్కు స్థలాన్ని కాపాడాలి

మేడ్చల్ టౌన్, జూన్ 27: పట్టణంలోని సత్యానగర్ కాలనీకి చెందిన 2వేల చదరపు గజాల పార్కు స్థలాన్ని కొందరు రియలెస్టేట్ వ్యాపారులు కబ్జాకు పాల్పడుతున్నారని కాలనీ అసోసియేషన్ వారు గురువారం మున్సిపల్ కమిషనర్ నాగిరెడ్డికి వినతి పత్రాన్ని సమర్పించారు. లేఔట్‌లో వదిలిన స్థలాన్ని కొందరు ఖబ్జా చేసే ప్రయత్నం చేస్తున్నారని పేర్కొన్నారు. దీనిపై పూర్తి విచారణ చేపడతామని కమిషనర్ వారికి హామీ ఇచ్చారు. పార్కు స్థలాలను కబ్జా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

కేసీఆర్‌ను కలిసిన తెలంగాణ ఉద్యమ నాయకులు

వికారాబాద్, జూన్ 27: తెలంగాణ రాష్ట్ర సాధకుడు, మాజీ సీఎం కేసీఆర్‌ను బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, తెలంగాణ ఉద్యమ నాయకులు నాసన్‌పల్లి దేవదాస్(దాసన్న) గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. కష్టకాలంలో పలువురు సీనియర్లు పార్టీని వదలివెళ్లడం విచారకరమన్నారు. పార్టీ అధికారంలో ఉన్నప్పుడు పదవులు అనుభవించి, అధికారం పోగానే పార్టీని వీడడం వారి స్వార్థ రాజకీయాలకు నిదర్శనమన్నారు. బీఆర్ఎస్ తిరిగి అధికారంలోకి వస్తుందని, కేసీఆర్ తిరిగి సీఎం అవడం ఖాయమన్నారు. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు నేటి నుంచి కాంగ్రెస్ ప్రభుత్వం చేసే ప్రజావ్యతిరేక పాలనను ఎండగడుతూ పోరాడాలని పిలుపునిచ్చారు.


జూలై 18 నుంచి సివిల్ సర్వీసెస్ లాంగ్‌టర్మ్ కోచింగ్

వికారాబాద్, జూన్ 27: సివిల్ సర్వీసెస్ లాంగ్ టర్మ్ (ప్రిలిమ్స్ కమ్ మెయిన్స్) పరీక్ష 2025కు కోచింగ్ తరగతులు జూలై 18 నుంచి ఏప్రిల్ 18, 2025 వరకు టీజీబీసీఈఎస్‌డీటీసీ(టీజీబీసీ స్టడీ సర్కిల్)లో హైదరాబాద్‌లో ప్రారంభమవుతుందని కలెక్టర్ ప్రతీక్ జైన్ ఒక ప్రకటనలో తెలిపారు. 150మంది అభ్యర్థులకు కోచింగ్ ఇవ్వనుండగా అందులో 100మందికి జూలై 7న నిర్వహించే ఆన్‌లైన్ స్ర్కీనింగ్‌టెస్ట్ ద్వారా ప్రతిభావంతులైన విద్యార్థులను ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. ప్రవేశం పొందిన అభ్యర్థులకు లాడ్జింగ్, భోజనం రవాణాకు కోసం రూ.5వేలు, పుస్తకాల కోసం రూ.5వేలు ఇవ్వనున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు 040 24071178 నెంబర్‌ను సంప్రదించాలన్నారు.

జూలై 1 నుంచి ఏకేఆర్ స్టడీ సర్కిల్‌లో..

వికారాబాద్, జూన్ 27: ఉభయ తెలుగు రాష్ట్రాలలో పోటీ పరీక్షల శిక్షణలో అగ్రగామి సంస్థగా ఉన్న వికారాబాద్ ఏకేఆర్ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో నాలుగవ, ఐదవ, ఆరవ, ఎనిమిదవ తరగతి చదువుతున్న విద్యార్థుల కోసం నవోదయ, సైనిక్, ఆర్ఎంఎస్ (రాష్ట్రీయ మిలిటరీ స్కూల్) కోచింగ్‌ను జూలై1 తేదీ సోమవారం నుండి ప్రారంభిస్తున్న ఏకేఆర్ స్టడీ సర్కిల్ డైరెక్టర్ బీవీ.రమణ ఒక ప్రకటనలో తెలిపారు. మొదటి బ్యాచ్‌కు ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం ఆరు వరకు, రెండవ బ్యాచ్‌కు సాయంత్రం 6 నుంచి సాయంత్రం 8.30 గంటల వరకు ఈ తరగతులు ఉంటాయన్నారు. మరిన్ని వివరాలకు 9441022571 నెంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి


ఎన్ఎఫ్‌సీనగర్‌లో ఉచితవైద్య శిబిరం

ఘట్‌కేసర్, జూన్ 27: ఉచితవైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కాంగ్రెస్ నాయకులు బొక్క ప్రభాకర్‌రెడ్డి, మేడబోయిన వెంకటేష్ ప్రజలను కోరారు. మున్సిపాలిటీ పరిధిలోని ఎన్ఎఫ్‌సీనగర్ కాలనీ 1వ వార్డులో గురువారం స్థానిక కాంగ్రెస్ పార్టీ వార్డు కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్యశిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కామినేని ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది, కౌన్సిలర్ సంగీత, నాయకులు పాల్గొన్నారు.

ఆర్ఎస్‌యూ నూతన కమిటీ ఎన్నిక

కొడంగల్, జూన్ 27: రెవెల్యూషనరీ స్టూడెంట్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు భీమారాజు ఆధ్వర్యంలో గురువారం కొడంగల్‌లో వికారాబాద్ జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా చంద్రకిరణ్, ఉపాధ్యక్షుడిగా బుట్ట అశోక్‌ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు చంద్రకిరణ్ మాట్లాడుతూ విద్యార్థుల సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు సురేశ్‌గౌడ్, శివ, కృష్ణ, అనిల్ పాల్గొన్నారు.

అమ్మ ఆదర్శ పాఠశాలల పనులను పూర్తి చేయాలి


పాఠశాలలో మూత్రశాలను పరిశీలిస్తున్న ఎంపీడీవో

కులకచర్ల, జూన్ 27: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అమ్మ ఆదర్శ పాఠశాలల పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపీడీవో రామకృష్ణ అన్నారు. మండలంలోని ముజాహిద్‌పూర్ చందనిగడ్డ ప్రాథమిక పాఠశాలలో జరుగుతున్న పనులను ఆయన గురువారం పరిశీలించారు. పనులు పూర్తి కాగానే బిల్లులు అందించనున్నట్లు తెలిపారు.

సంక్షిప్తంగా..

● ఘట్‌కేసర్: చౌదరిగూడ గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారిగా మండల అధికారులనే నియమించాలని ఆగ్రామ మాజీ సర్పంచ్ బైరు రమాదేవి రాములు గౌడ్ గురువారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.

● కొడంగల్ రూరల్: పశువులకు వ్యాధులు సోకకుండా ముందు జాగ్రత్తగా టీకాలు వేయించాలని మాజీ ఎమ్మెల్యే గురునాథ్‌రెడ్డి అన్నారు. కొడంగల్‌లో గురువారం లంపిస్కిన్ వ్యాధి నివారణ టీకాల కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు.

● దోమ/కొడంగల్: ఈ నెల 30న దోమ మండలంలోని బ్రహ్మణపల్లి గ్రామంలో చేపట్టనున్న అంబేడ్కర్ విగ్రహ ఆవిష్కరణకు రావాలని దళిత సంఘాల నాయకులు కోరారు. గురువారం హైదరాబాద్‌లో పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డిని వారు మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వానించారు. అదేవిధంగా విగ్రహావిష్కరణకు సంబంధించిన కరపత్రాలను ప్రజా సంఘాల నాయకులు కొడంగల్‌లోని అంబేడ్కర్ చౌరస్తాలో గురువారం ఆవిష్కరించారు. యు.రమేశ్‌బాబు, బుస్స చంద్రయ్య, మాదారం వెంకటయ్య, ఎరన్‌పల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

● బొంరాస్‌పేట్: దీర్ఘకాలిక వ్యాధులపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రతినిధి డాక్టర్ శిరీష తెలిపారు. ఆమె గురువారం జిల్లా ఉపవైద్యాధికారి రవీంద్రయాదవ్‌తో కలిసి బొంరాస్‌పేట్ మండల కేంద్రంలోని ప్రభుత్వాసుపత్రిలో రోగులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు హేమంత్‌కుమార్ పాల్గొన్నారు.

● బొంరాస్‌పేట్: హంసన్‌పల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ 11 కేవీ లింగంపల్లి ఫీడర్ పరిధిలోని రేగడిమైలారం, లింగంపల్లి, సత్తర్‌కుంట తండా, నాన్‌చెరువు తండా, గడ్డమీది తండా గ్రామాల్లో శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని ఏఈ నాగరాజు గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

● కులకచర్ల: కులకచర్ల గ్రామ పరిధిలో పారిశుధ్య పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. మురికి కాల్వల్లో ఉన్న మట్టిని, చెత్తాచెదారాన్ని తొలగించి ట్రాక్టర్ ద్వారా పారిశుధ్య కార్మికులు గ్రామం వెలుపలకు తరలిస్తున్నారు. పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి దగ్గరుండి పనులు చేయిస్తున్నారు.

● బషీరాబాద్: నవాంద్గీ సొసైటీలో 300 డీఏపీ బస్తాలు అందుబాటులో ఉన్నాయని ఆ సంఘం సీఈవో బందెయ్యగౌడ్ తెలిపారు. అవసరమైన రైతులు వ్యవసాయ అధికారుల వద్ద పర్మిట్ పొంది తీసుకోవాలని సూచించారు.

● కొడంగల్ రూరల్: మండల సర్వసభ్య సమావేశాన్ని నేడు(శుక్రవారం) నిర్వహించనున్నట్లు ఎంపీడీవో కె.ఉషశ్రీ గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 11గంటలకు స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ ముద్దప్పదేశముఖ్ అధ్యక్షతన జరిగే సమావేశానికి ప్రజాప్రతినిధులు, అధికారులు విధిగా హాజరు కావాలని కోరారు.

● తాండూరు: డ్రైవర్లు ట్రాఫిక్ నియమ నిబంధనలు పాటించాలని తాండూరు ఎస్ఐ కాశీనాథ్ సూచించారు. తాండూరు పోలీస్ స్టేషన్ ఆవరణలో గురువారం మండల్ లీగల్ సర్విస్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఎస్ఐ పాల్గొని ప్రసంగించారు.

● బషీరాబాద్: మండలంలోని పర్వత్‌పల్లిలో మహిళా రైతు కూర్వ కాశమ్మ మృతిచెందగా నవాంద్గీ సొసైటీ చైర్మన్ ఎ.వెంకట్‌రాంరెడ్డి మృతురాలి అంత్యక్రియలకు రైతు కుటుంబానికి రూ.9వేల ఆర్థిక సాయాన్ని గురువారం అందజేశారు.

● వికారాబాద్: ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వంలో భారత్ అగ్రగామిగా నిలిచిందని బీజేపీ నాయకులు, మాజీ మేయర్ సుభాష్ చందజీ అన్నారు. జిల్లా బీజేపీ కార్యాలయంలో గురువారం 25 జూన్ 1975 ప్రజాస్వామ్యానికి చీకటి రోజును గుర్తుచేస్తూ కార్యక్రమం నిర్వహించగా ముఖ్య అతిథిగా హాజరైన మాట్లాడారు. నరేంద్ర మోడీ నాయకత్వంలో ఆర్టికల్ 370ని రద్దుచేసి దేశాన్ని అగ్రస్థానంలో నిలపడానికి మోడీ కృషిచేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి, శివరాజ్ పాల్గొన్నారు.